



శ్రీకృష్ణపై దాడి చేసిన గూండాలు

ఎర్రిస్వామి.. వెడలె..



జైలులోకి వెళ్తున్న ఎర్రిస్వామి

9 కి.మీ. దూరం..
2.30 గంటల ప్రయాణం

జిల్లా జైలుకు చేరిన బహుదూరపు బాటసారి



మిద్దె ఎర్రిస్వామి..! ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై విచక్షణా రహితంగా దాడి చేసిన వైసీపీ మందలో ఒకడు..! అధికార పార్టీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి అనుచరుడు. పోలీసులు అతనిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి.. అరెస్టు చేశారు. కోర్టులో హాజరుపరిచారు. కోర్టు ఆదేశాల మేరకు బుధవారం రిమాండ్‌కు తరలించారు. రాప్తాడు స్టేషన్‌కు మంగళవారం దర్జాగా వచ్చిన ఎర్రిస్వామి.. అంతే దర్జాగా జిల్లా జైలుకు వెళ్లాడు. ఎంత దర్జాగా అంటే.. పోలీసు జీపులో కాకుండా.. వైసీపీ నాయకులు సిద్ధం చేసిన బ్లాక్ స్కార్పియోలో..! కోర్టు నుంచి జిల్లా జైలుకు కేవలం తొమ్మిది కిలో మీటర్ల దూరం ఉండగా.. ఆ కాస్త దూర ప్రయాణాన్ని.. ఖరీదైన వాహనంలో రెండున్నర గంటల్లో పూర్తి చేశాడు. 'ఫార్ములా వన్'లో స్లో రేసింగ్ పెడితే.. మనోడికే మొదటి ప్రైజు గ్యారెంటీ..!

బై.. ఫ్రెండ్స్..



జైలు లోపలికి వెళ్లే ముందు..

జైలు లోపలికి ఖైదీలను తరలించే సమయంలో పోలీసులు వారి వెంటే ఉండి.. పారిపోకుండా జాగ్రత్త వహిస్తారు. కానీ రాప్తాడు పోలీసులు అతన్ని వెనుక వదిలేసి.. ముందుగా జైల్లోకి వెళ్లారు. ఆ తరువాత ఎర్రిస్వామి.. వెళ్లలేక వెళ్లలేక.. వెనక్కి తిరిగి చూస్తూ.. వెంట వచ్చిన వైసీపీ మద్దతుదారులకు 'వెళ్లొస్తా.. మళ్లొస్తా..' అని చెబుతూ నింపాదిగా వెళ్లారు. రాప్తాడు పీఎస్ వద్ద మొదలైన రాచమర్యాదలు.. రెడ్డిపల్లి జిల్లా జైలు వరకూ ఒకటిన్నర రోజు కొనసాగాయి.

రిమాండ్ రిజెక్ట్ పిటిషన్ తిరస్కరణ

ఎర్రిస్వామిని రిమాండ్‌కు తరలించవద్దని అతని తరపు న్యాయవాది కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మొబైల్ కోర్టు న్యాయాధికారి సుజిన్‌కుమార్ ఆ పిటిషన్‌ను తిరస్కరించారు. మార్చి ఆరో తేదీ వరకూ రిమాండ్‌కు ఆదేశించారు. రాప్తాడు సమీపంలో ఈ నెల 18న జరిగిన సిద్ధం సభలో వైసీపీ గూండాలు శ్రీకృష్ణపై దాడి చేసిన సంగతి తెలిసిందే. దాడి చేసినవారిలో ఆరుగురిని గుర్తించామని ఎస్పీ అన్బురాజన్ ప్రకటించారు. వారిలో కూడేరు మండలం మరుట్ల రెండో కాలనీకి చెందిన మిద్దె ఎర్రిస్వామిని మాత్రమే రాప్తాడు పోలీసులు ఇప్పటి వరకూ అరెస్టు చేశారు.

- అనంతపురం క్రైం

పట్టుకుంటారా..!

శ్రీకృష్ణపై దాడి చేసి.. అండర్ గ్రౌండ్‌లోకి..
వైసీపీ నాయకుల రక్షణలో గూండాలు
ఆరుగురిని గుర్తించామని ప్రకటించిన ఎస్పీ
వివరాలు బయట పెట్టని పోలీసు అధికారులు
పక్కా వీడియో ఆధారాలున్నా.. పట్టుకోరెందుకు..?

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 21: రాప్తాడు సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడికి దిగిన వైసీపీ గూండాలను పోలీసులు పట్టుకుంటారా..? అందరినీ గుర్తించేందుకు కొంచెమైనా ప్రయత్నిస్తున్నారా..? అన్న సందేహాలు తలెత్తుతున్నాయి. దాడి చేసినవారిలో ఎవరెవరు ఎక్కడున్నారనేది చర్చనీయాంశంగా మారింది. ఈ కేసులో అరెస్టయిన ఒకే ఒక్కడు మిద్దె ఎర్రిస్వామి. మిగిలినవారిలో మంత్రి ఉష శ్రీచరణ్ అనుచరుడు అశోక్, రాప్తాడు ఎమ్మెల్యే పంచన చేరిన బండి రవి మినహా.. మిగిలినవారు ఎవరన్నది పోలీసులు గుర్తించలేదు. వీడియో చూసిన జనం.. దాడి చేసినవారిలో ఏడెనిమిది మంది వివరాలను స్పష్టంగా చెబుతున్నారు. అయినా పోలీసులు చొరవ చూపడం లేదు. దీంతో ఈ కేసు దర్యాప్తుపై అనుమానాలు తలెత్తుతున్నాయి. గూండాలను పోలీసులు పట్టుకుంటారా..? అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి వదిలిపెడతారా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.



ఎస్పీని కలిసిన జర్నలిస్టులు

మారిన లెక్క..

శ్రీకృష్ణపై దాడి చేసిన వారిలో ఆరుగురిని గుర్తించామని ఎస్పీ అన్బురాజన్ మంగళవారం ప్రకటించారు. కానీ బుధవారానికి ఈ సంఖ్య నాలుగుకు తగ్గించారు. ఈ నలుగురిలో ఎర్రిస్వామి అరెస్టు అయ్యాడు. ఇతనుకాక, కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని దొడఘట్టకు చెందిన అశోక్, కళ్యాణదుర్గం మండలం బోయలపల్లికి చెందిన కురుబ నాగేంద్ర, కనగానపల్లి మండలం కోనాపురం గ్రామానికి చెందినబండి రవి పేర్లు మాత్రమే ఇప్పటి వరకూ బయటకు వచ్చాయి. వీరిని అరెస్ట్ చేయాల్సి ఉంది. దాడి చేస్తున్నవారిలో సుమారు ఏడెనిమిది మంది ముఖాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. చిన్న క్లూ దొరికినా దూసుకుపోయే పోలీసులు.. ఇంత స్పష్టమైన ఆధారాలు ఉన్నా దుండగులను పట్టుకోకపోవడం, వివరాలు బయట పెట్టకపోవడం అనుమానాలకు తావిస్తోంది. దీని వెనుక అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లు ఉన్నాయన్న సందేహాలు తలెత్తుతున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో దుండగులు అండర్ గ్రౌండ్‌లో హాయిగా ఉన్నట్లు కనిపిస్తోంది.

ఆ ఇద్దరు ఎవరు..?

శ్రీకృష్ణపై దాడి కేసును రాప్తాడు పోలీసులే దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసుపై ప్రత్యేక దృష్టి పెట్టామని ఎస్పీ అన్బురాజన్ ప్రకటించారు. ఆరుగురిని గుర్తించామని చెప్పిన పోలీసులు.. నలుగురి పేర్లను అనధికారికంగా బయటపెట్టారు. దీంతో మిగిలిన ఆ ఇద్దరు ఎవరు..? అన్న సందేహాలు తలెత్తుతున్నాయి. రాప్తాడు సీఐ మునిస్వామి కొత్తగా వచ్చారు. ఆయనకు ఈ మండల ప్రాంతమే కొత్త. కేసు దర్యాప్తు బాధ్యతలు రాప్తాడు స్టేషన్‌కే పరిమితం చేస్తే.. కనగానపల్లి, కళ్యాణదుర్గం ప్రాంతాలలోని వైసీపీ గూండాలను ఎలా పట్టుకోగలరు..? ఆయా మండలాల పోలీసుల నుంచి రాప్తాడు పోలీసులకు సరైన సహకారం అందడం లేదని సమాచారం. 'ఎవరినైనా గుర్తించారా..? గుర్తించినవారు ఎక్కడున్నారో తెలిసిందా..?' అని అడిగితే.. 'ఇంకా దొరకలేదబ్బా.. వెతుకుతున్నాం' అని చెబుతున్నారట. కొన్ని సందర్భాల్లో ఎస్‌బీ, సీసీఎస్, ఎస్‌ఓజీ తదితర ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపే పోలీసు శాఖ ఉన్నతాధికారులు.. ఓ జర్నలిస్టుపై అత్యంత పాశవికంగా దాడిచేస్తే.. అమానవీయంగా ప్రవర్తిస్తే.. ఆ కేసు దర్యాప్తు పట్ల ఆసక్తి చూపకపోవడం విమర్శలకు తావిస్తోంది. అధికార పార్టీవారే దాడికి పాల్పడినందున.. పోలీసులు వారివైపు కన్నెత్తి చూసేందుకు జంకుతున్నారన్న చర్చ జరుగుతోంది. ఎర్రిస్వామికి రాచమర్యాదలు చేయడం, 'ఎమ్మెల్యే ఇంటి వద్ద ఉన్నా..' అని లొకేషన్ పెట్టినా.. బండి రవిని అరెస్టు చేయకపోవడం పోలీసులపై ఒత్తిళ్లు పనిచేస్తున్నాయని చెప్పేందుకు నిదర్శనం.



మొబైల్ కోర్టు వద్ద ఎర్రిస్వామి

వాక్ స్వాతంత్ర్యంపై దాడి

సీఎం జగన్ తీరు గర్హనీయం

శ్రీకృష్ణపై దాడిచేసిన వారిని అరెస్టు చేయాలి
జర్నలిస్టు, విద్యార్థి, విపక్ష నాయకుల డిమాండ్



ఉరవకొండలో అంబేడ్కర్ విగ్రహం వద్ద టీడీపీ నాయకుల ఆందోళన

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 21: వైసీపీ అధికారం చేపట్టిన తరువాత వాక్ స్వాతంత్ర్యంపై దాడి జరుగుతోందని వివిధ రాజకీయ పార్టీలు, విద్యార్థి, జర్నలిస్టు సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఫొటో జర్నలిస్టు శ్రీకృష్ణపై దాడికి పాల్పడ్డవారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశాయి. దాడి ఘటనపై సీఎం జగన్ తీరు గర్హనీయమని ఏఐఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు వేమన, ఆర్ఐపీ జిల్లా కన్వీనర్ మల్లికార్జున మండిపడ్డారు. ఏఐఎస్ఏ ఆధ్వర్యంలో వారు నగరంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం క్లాక్‌టవర్ వద్ద నిరసన తెలిపారు. ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభమైన మీడియాను వైసీపీ అంతమొందించాలని చూస్తోందని ఆరోపించారు. వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలను బహిర్గతం చేస్తున్న ఆంధ్రజ్యోతి, ఏబీఎన్, ఈనాడు, టీవీ5 ప్రతినిధులపై దాడులకు తెగబడటం ఇందుకు నిదర్శనమని అన్నారు. శ్రీకృష్ణపై హత్యాయత్నానికి పాల్పడిన అందరినీ తక్షణమే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కర్నూలు ఈనాడు కార్యాలయాన్ని ధ్వంసం చేసిన కాటసాని అనుచరులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. పోలీస్ శాఖ స్పందించకుంటే పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు వీరు, ఇస్మాయిల్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

● కళ్యాణదుర్గంలో బీజేపీ నాయకులు నిరసన ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లి.. సూపరింటెండెంట్ సందీప్‌కు వినతిపత్రం సమర్పించారు. శ్రీకృష్ణపై దాడి చేసిన వైసీపీ మూకలను అరెస్టు చేయాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ముప్పూరి దేవరాజ్ డిమాండ్ చేశారు. గుంతకల్లులో ఏపీయూడబ్ల్యూజే నాయకులు తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. తహసీల్దారు శేషఫణికి, ఆర్డీఓ కార్యాలయంలో డీటీ శాంతికుమారికి వినతిపత్రం సమర్పించారు. ఉరవకొండలో అంబేడ్కర్ విగ్రహం వద్ద టీడీపీ నాయకులు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. శింగనమలలో జర్నలిస్టులు తహసీల్దారు శోభన్‌బాబుకు వినతిపత్రం సమర్పించారు.



దాడిని నిరసిస్తూ నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

నినదిద్దాం.. నిలదీద్దాం..!



ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడికి నిరసనగా జర్నలిస్టు సంఘాలు 'చలో అనంతపురం' కార్యక్రమాన్ని చేపట్టాయి. నగరంలోని సంగమేష్ సర్కిల్ నుంచి గురువారం ఉదయం 10.30 గంటలకు శాంతియుత ర్యాలీని జర్నలిస్టు నాయకులు ప్రారంభిస్తారు. కలెక్టరేట్ వద్దకు చేరుకుని ధర్నా నిర్వహిస్తారు. ప్రజాస్వామ్యవాదులందరూ ఈ ఆందోళనకు మద్దతుగా నిలవాలని జర్నలిస్టు సంఘాల రాష్ట్ర నాయకులు పిలుపునిచ్చారు. వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా, విద్యార్థి సంఘాలు ఈ కార్యక్రమంలో భాగం కానున్నాయి.

నేడు చలో అనంతపురం
జిల్లా కేంద్రానికి రాష్ట్ర నేతలు
పొరుగు జిల్లాల నుంచి జర్నలిస్టులు
కలెక్టరేట్ వరకూ శాంతియుత ర్యాలీ
ఫొటో జర్నలిస్టు శ్రీకృష్ణపై దాడికి నిరసన

(7లో....)

ఏమిటీ దౌర్భాగ్యం..?

గుమ్మఘట్ట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు వీరు. మధ్యాహ్న భోజనం తరువాత తాగేందుకు గుక్కెడు నీరు లేక అల్లాడిపోతున్నారు. కొందరు ఇళ్ల నుంచి తెచ్చుకుని తాగుతున్నారు. భోజనం తరువాత పాఠశాల సమీపంలో మురుగునీటి కాలువలోకి దిగి, అక్కడ తాగునీటి ప్లాంట్ నుంచి బయటకు వెళుతున్న వృథా నీటిలో ప్లేట్లు శుభ్రం చేసుకుంటున్నారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. పాఠశాలలో దాదాపు 400 మంది విద్యార్థులు ఉన్నారు. అందరికీ సరిపడా తాగునీటి సౌకర్యం లేదు. పాఠశాలలో నీటి కొరత లేదని విద్యాశాఖ అధికారులు అంటున్నారు. విద్యార్థులు అధిక సంఖ్యలో ఉన్నారని, నిలువ ఉన్న నీటిలో ప్లేట్లను శుభ్రం చేసుకుంటున్నారని సమర్థించుకుంటున్నారు. నీటి కొరత లేకుంటే.. ఇలా మురుగునీటిలోకి విద్యార్థులు ఎందుకు దిగుతారు..? అధికారులు స్పందించి.. సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఉంది. - గుమ్మఘట్ట



కలిసికట్టుగా పనిచేస్తాం



ఉమా, ఉన్నం సంయుక్తంగా విలేకరుల సమావేశం

మాట్లాడుతున్న ఉమామహేశ్వరనాయుడు, ఉన్నం హనుమంతరాయచౌదరి

కళ్యాణదుర్గం రూరల్, ఫిబ్రవరి 21: పార్టీ అభివృద్ధి కోసం కలిసికట్టుగా పని చేస్తామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఉమామహేశ్వరనాయుడు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉన్నం హనుమంతరాయచౌదరి ప్రకటించారు. స్థానిక ఎన్టీఆర్ భవన్‌లో బుధవారం వారిద్దరూ సంయుక్తంగా విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కొన్ని అనివార్య కారణాల వల్ల గత ఐదేళ్ల నుంచి తాము విడివిడిగా కార్యక్రమాలు నిర్వహించాల్సి వచ్చిందన్నారు. ఇలా చేసినా పార్టీ అభివృద్ధి కోసమే తప్ప స్వలాభం కోసం ఎన్నడూ పని చేయలేదన్నారు. నియోజకవర్గంలో 40 సంవత్సరాలుగా పార్టీ బలోపేతానికి కృషి చేసినట్లు వివరించారు. ప్రస్తుతం కొంత మంది టికెట్ తమకే కేటాయించినట్లు ప్రచారం చేస్తున్నారని ఇటువంటి దుష్ప్రచారాలను నమ్మవద్దని ప్రజలు, పార్టీ కార్యకర్తలకు తెలియజేశారు. రాష్ట్రంలో టీడీపీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. కళ్యాణదుర్గంలో విజయమే ధ్యేయంగా పని చేస్తామన్నారు. పార్టీ కోసం కష్టపడిన వారికే ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలని అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు పార్టీలో కష్టపడిన వారికే గుర్తింపు వుంటుందని పలు సందర్భాలలో తెలిపిన విషయాన్ని ఈ సందర్భంగా వారిద్దరూ గుర్తు చేశారు. కార్యక్రమంలో భారీ ఎత్తున టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



హనుమద్వాహనంపై ఊరేగిన శ్రీహరు

బుక్కరాయసముద్రం, ఫిబ్రవరి 21: కొండమీద రాయుడి బ్రహోత్సవాల్లో భాగంగా ఐదో రోజైన బుధవారం స్వామీ అమ్మవార్లను హనుమద్వాహనంపై ఊరేగించారు. ఉదయం స్థానిక అంజినేయ స్వామి దేవాలయంలో స్వామి ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకిలో ఉరేగించారు. సాయంత్రం హనుమద్వాహనంపై ఊరేగుతూ స్వామీ అమ్మవార్లు దర్శనమిచ్చారు. గురువారం గరుడవాహన సేవ ఉంటుందని ఆలయకమిటీ సభ్యులు తెలిపారు

అంతా.. పదిలమేనా?

నెల రోజుల్లో 'పది' పరీక్షలు

జిల్లాలో 142 కేంద్రాలు.. 40,063 మంది విద్యార్థులు
జిల్లాకు చేరిన సమాధాన పత్రాలు
మార్చి తొలివారంలో రానున్న ప్రశ్నపత్రాలు
పరీక్షల నిర్వహణపై కొత్త డీఈఓ మార్క్ ఉంటుందా..?



జిల్లాకు చేరిన పదో తరగతి ఆన్సర్ షీట్స్ (ఫైల్)

అనంతపురం విద్య, ఫిబ్రవరి 21: పదో తరగతి పరీక్షలకు సమయం దగ్గర పడుతోంది. వచ్చే నెల 18 నుంచి జిల్లా వ్యాప్తంగా 142 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా పబ్లిక్, ప్రైవేట్ విద్యార్థులు దాదాపు 40 వేల మందికి పైగా పరీక్షలు రాయనున్నారు. ఇప్పటికే పరీక్షల సమాధాన పత్రాలు జిల్లా కేంద్రానికి చేరాయి. గతంతో పోలిస్తే ఈ ఏడాది పది పరీక్షలు అధికారులకు పరీక్షగానే నిలువనున్నాయి. గతంలో ఉన్న విద్యాశాఖాధికారులు పది పరీక్షలను తీవ్ర నిర్లక్ష్యం చేశారు. అనంత సంకల్పంపై పర్యవేక్షణ వదిలేశారు. స్కూళ్ల తనిఖీలు మరిచారు. చుట్టుపు చూపుగా వెళ్లడం మినహా...10వ తరగతి విద్యార్థుల ప్రొగ్రెస్‌పై మానిటరింగ్‌ను పక్కనబెట్టేశారు. ఇటీవలే కొత్త డీఈఓగా వరలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. మరి పది పరీక్షలపై పర్యవేక్షణకు కమిటీలు వేస్తారా..? తనదైన మార్క్ చూపుతారా అన్నది తెలియాల్సి ఉంది.

142 కేంద్రాల్లో 40,063 మంది..

పదో తరగతి పరీక్షలు వచ్చే నెల 18వ తేదీ నుంచి 27వ తేదీ వరకూ నిర్వహించనున్నారు. 18న ఫస్ట్ లాంగ్వేజ్, 19న సెకెండ్ లాంగ్వేజ్, 20న ఇంగ్లిష్, 22న గణితం, 23న ఫిజికల్ సైన్స్, 26న బయలాజికల్ సైన్స్, 27న సోషియల్ పరీక్షలు జరగనున్నాయి. నిర్ణీత తేదీల్లో ఉదయం 9.45 గంటల నుంచి మధ్యాహ్నం 12.45గంటల వరకూ నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 585 హైస్కూళ్ల విద్యార్థులు పరీక్షలను రాయనున్నారు. ఈ ఏడాది రెగ్యులర్ విద్యార్థులు 31,330 మంది, ప్రైవేట్ విద్యార్థులు 8733 మంది పరీక్షలు రాయనున్నారు. 2021-22, 2022-23 విద్యా సంవత్సరాల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు ఎక్కువగా ఉండటంతో వారంతా ఈ ఏడాది ప్రైవేట్ విద్యార్థులుగా పరీక్షలను రాయనున్నారు. జిల్లాలో 142 పరీక్షా కేంద్రాలను ఎంపిక చేశారు. అందులో ఏ సెంటర్లు 104 ఉండగా, బీ సెంటర్లు 38 ఉన్నాయి.

మార్చి తొలివారంలో ప్రశ్నపత్రాలు...

పదో తరగతి పరీక్షలకు సంబంధించి మార్చి తొలివారంలో జిల్లాకు ప్రశ్నపత్రాలు రానున్నాయి. ఇప్పటికే సమాధాన పత్రాలు జిల్లాకు చేరాయి. 24 పేజీల బుక్‌లెట్స్ 3.04 లక్షలు, 12పేజీల బుక్ లెట్స్ 2.04 లక్షలు, గ్రాఫ్స్ (సింగల్‌పేజీ) 60 వేలు వచ్చాయి. వీటిని జిల్లా కేంద్రం లోని కేఎస్ఆర్ హైస్కూల్‌లో భద్రపరిచారు. ప్రశ్నపత్నాలు సెట్-1 మార్చి 3న, ప్రశ్నపత్రాల సెట్-2 మార్చి 4న జిల్లాకు చేరే అవకాశం ఉందని జిల్లా విద్యాశాఖ పరీక్షల విభాగం అధికారులు చెబుతున్నారు. పరీక్షల కోసం సుమారు 90 శాతం వరకూ ఇప్పటికే చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటల్ ఆఫీసర్ల నియామకాలు కూడా పూర్తి చేశారు. పరీక్షలకు వడివడిగా ఏర్పాట్లు జరుగుతున్నాయి.



పర్యవేక్షణ కరువైందా..?

ఈ ఏడాది పదో తరగతి పరీక్షలపై పర్యవేక్షణ కరువైంది. అనంత సంకల్పం స్టడీ అవర్స్‌లో విద్యార్థులు ఏం చదువుతున్నారు. వెనుకబడిన విద్యార్థులు ఎంత మంది ఉన్నారు..? ఏయే సబ్జెక్టుల్లో వెనుకబడి ఉన్నారు..? వారిని పరీక్షలకు సన్నద్ధం చేయడానికి ఏం చర్యలు తీసు కుంటున్నారు వంటి అంశాలపై నిత్యం పర్యవేక్షణ జరుగుతుండాలి. గతంలో పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలు ఉండేవి. అయితే ఇటీవల విద్యాశాఖాధికారులు ఆ విషయాలను ఏమాత్రం పట్టించుకోవడం లేదు. కొత్తగా వచ్చిన డీఈఓ పదో తరగతిపై ప్రత్యేక శ్రద్ధ పెడతారా లేక వదిలేస్తారా అనే ప్రశ్నలు కలుగుతున్నాయి.



డీఈఓ ఆఫీస్



ప్రత్యేక శ్రద్ధ పెట్టాం

పదో తరగతి పరీక్షలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాం. ఇప్పటికే 'అనంత సంకల్పం' ద్వారా విద్యార్థుల సామర్థ్యాలు పెంచడానికి కృషి చేస్తున్నాం. స్కూళ్ల ప్రధానోపాధ్యాయలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. డిప్యూటీ డీఈఓలు పర్యవేక్షణ చేయాలని ఆదేశించాం. ఒకటి లేదా రెండు రోజుల్లో ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహిస్తాం. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశిస్తాం. - వరలక్ష్మి, డీఈఓ, అనంతపురం

పకడ్బందీగా పరీక్షలు నిర్వహిస్తాం

జిల్లాలో 142 కేంద్రాలు ఉన్నాయి. 40 వేల మందికిపైగా పరీక్షలు రాయనున్నారు. మార్చి తొలివారంలో ప్రశ్నపత్రాలు జిల్లాకు వస్తాయి. ఈ ఏడాది 8733 మంది ప్రైవేట్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వారికి ఇదే చివరి అవకాశం. మళ్లీ ఫెయిల్ అయితే 2025లో వారికి మారిన సిలబస్ ఆధారంగా పరీక్షలు ఉంటాయి. దీంతో ప్రైవేట్ విద్యార్థులు ఈ ఏడాది మార్చిలో రాసే పరీక్షలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. డీఈఓ పర్యవేక్షణలో మార్చిలో జరిగే పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తాం.

- గోవింద్‌నాయక్, ఏసీ, ప్రభుత్వ పరీక్షల విభాగం



ప్రజల సొమ్ము దోచేస్తున్న సీఎం

- ఎమ్మెల్యే కేతిరెడ్డి గుడ్‌మార్నింగ్‌ను కబ్జా మార్నింగ్‌గా మార్చారు
- మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల విమర్శ



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల

ధర్మవరం, ఫిబ్రవరి 21: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఒక చేత్తో బటన్ నొక్కి.. మరొక చేత్తో ప్రజల సొమ్మంతా దోచేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ విమర్శించారు. పట్టణంలోని తన వ్యక్తిగత కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ నాయకులు దాడులు, దౌర్జన్యాలు, కబ్జాలు చేస్తూ ప్రజల సొమ్మును పీక్కు తింటున్నారని అన్నారు. సీఎం జగన్ ఒక చేత్తో బటన్ నొక్కి.. మరో చేత్తో ఇచ్చిన సొమ్ముకు పదింతలు లాగేసుకుంటున్నారని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే కేతిరెడ్డి గుడ్‌మార్నింగ్‌ను కబ్జా మార్నింగ్‌గా మార్చేశారని దుయ్యబట్టారు. కబ్జాలు, దౌర్జన్యాల ద్వారా రూ.4వేల కోట్లకు పైగా దోచేశారని విమర్శించారు. జగన్ ప్రభుత్వంలో ఒక్క అభివృద్ధి పనైనా జరిగిందా అని ప్రశ్నించారు. వీటిని పత్రికల్లో చూపిస్తే.. భౌతిక దాడులకు దిగుతూ పైశాచిక ఆనందం పొందుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో గంజాయి, గుట్కా, మట్కా, విచ్చలవిడిగా సాగుతోందన్నారు. చాలా స్కూళ్లలో నాడు-నేడు పనులు మధ్యలోనే ఆగిపోయాయన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఏకంగా 9 సార్లు కరెంటు చార్జీలు పెరిగాయన్నారు. అలాగే నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతుండడంతో సామాన్యులు, పేదలు కొనలేని దుస్థితిలో ఉన్నారన్నారు. ఇక ఇసుక, కంకర ధరలు పదింతలు పెరగడంతో పేదలు ఇళ్లు కట్టుకోవడం గగనమైందన్నారు. ధర్మవరం పట్టణమంతా గుంతలమయమైతే.. వాటిని బాగు చేయాల్సిన ఎమ్మెల్యే నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారని అన్నారు. మా ఒత్తిళ్లకు తలొగ్గి ఒకటిరెండు చోట్ల బాగుచేసి.. మిగిలిన చోట్ల అలాగే వదిలేశారని మండిపడ్డారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి తీవ్ర రూపం దాల్చుతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదన్నారు. దీంతో తామే ముందుకొచ్చి తన సొంత నిధులతో గ్రామాల్లోకి వెళ్లి తాగునీటి ఎద్దడి నివారణకు కృషిచేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు డిష్ రాజు, తుంపర్తి పరమేశ్, బోడగల గిరిధర్, దుస్సా క్రిష్ణ, దేవేంద్రనాథ్‌రెడ్డి, నారాయణస్వామి, నబీరసూల్, రాప్తాటిరాము, మార్కెట్ రహీం గొట్లూరు చంద్ర, నారాయణస్వామి యాదవ్ పాల్గొన్నారు.

నేడు చలో అనంతపురం

- జర్నలిస్టు సంఘాల పిలుపు
- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడికి నిరసన
- అనంతకు వెళ్లకుండా ఇతర జిల్లాల జర్నలిస్టులకు నోటీసులు
- జర్నలిస్టు సంఘాల నాయకుల ఇళ్ల వద్ద పోలీసుల తిష్ట

అనంతపురం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): రాప్తాడు వద్ద ఈ నెల 18న నిర్వహించిన సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై జరిగిన దాడిని నిరసిస్తూ జర్నలిస్టు సంఘాలు గురువారం 'చలో అనంతపురం' పేరిట ఆందోళనకు సిద్ధమయ్యాయి. అనంతపురం నగరంలోని సంగమేష్ సర్కిల్ నుంచి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు గురువారం ఉదయం 10.30 గంటలకు నిరసన ర్యాలీ ప్రారంభమౌతుంది. కలెక్టరేట్ వరకూ ర్యాలీ కొనసాగుతుంది. అనంతరం అక్కడ ధర్నా నిర్వహిస్తారు. జర్నలిస్టులపై దాడి ప్రజాస్వామ్యానికే పెనుముప్పుగా మారనుందని, దాడులు పునరావృతం కాకుండా పాలకులు, పోలీసులు చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని జర్నలిస్టు సంఘాల నాయకులు అన్నారు. జర్నలిస్టుల రక్షణే ప్రధాన అజెండాగా నిర్వహిస్తున్న ఈ ధర్నాలో జర్నలిస్టు సంఘాల రాష్ట్ర నాయకులు, ప్రజాస్వామికవాదులు, రాజకీయ నాయకులు, ప్రజా, విద్యార్థి, ఉద్యోగ, కార్మిక, యువజన సంఘాలు భాగం కానున్నాయి. ఏపీయూడబ్ల్యూజే, ఇతర జర్నలిస్టు సంఘాల నేతృత్వంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఐవీ సుబ్బారావు, చందు జనార్దన్, రాష్ట్ర కార్యదర్శి రామసుబ్బారెడ్డి, సామ్నా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ధర్మారావు, రమణారెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శివ, ఫొటో జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర నాయకులు సాంబశివరావు హాజరుకానున్నారు.



ఆదోని పోలీస్ స్టేషన్‌లో ఉన్న జర్నలిస్టులు



జర్నలిస్టులకూ పోలీసు ఆంక్షలు

జర్నలిస్టులు చేపట్టిన 'చలో అనంతపురం' కార్యక్రమంలో పాల్గొనేందుకు వివిధ జిల్లాలకు చెందిన జర్నలిస్టులు పెద్ద ఎత్తున హాజరయ్యేందుకు సన్నాహాలు చేసుకున్నారు. అయితే ఆయా జిల్లాల పోలీసుల నుంచి జర్నలిస్టులకు ఆంక్షలు ఎదురవుతున్నాయి. 'చలో అనంతపురం' కార్యక్రమానికి వెళ్లొద్దంటూ ఆయా ప్రాంతాల పోలీసులు జర్నలిస్టులకు ఫోన్ చేసి హెచ్చరించారు. మరికొందరిని పోలీస్ స్టేషన్‌కు రండి అని పిలిచారు. మరికొందరు జర్నలిస్టుల ఇళ్ల వద్దకు వెళ్లి నోటీసులు ఇచ్చారు. ఏపీయూడబ్ల్యూజే నాయకుల ఇళ్ల వద్ద పోలీసులు తిష్ట వేశారు. దీన్నిబట్టి జర్నలిస్టులపై పోలీసులు ఏస్థాయిలో ఆంక్షలు అమలు చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. ఆంధ్రజ్యోతి అనంతపురం జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపైనే కాకుండా, కర్నూలు, మద్దికెర ప్రాంతాల్లో జర్నలిస్టులు, పత్రికా కార్యాలయాలపైనా వైసీపీ మూకలు దాడులు చేశాయి. ఈ నేపథ్యంలోనే... పత్రికా స్వేచ్ఛను కాపాడాలని, జర్నలిస్టులపై దాడులు ఆపాలని డిమాండ్ చేస్తూ జర్నలిస్టు సంఘాలు 'చలో అనంతపురం' చేపట్టాయి. అనంతపురం జిల్లా కేంద్రంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలిగించకుండా, ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బంది లేకుండా జర్నలిస్టులు ర్యాలీ, ధర్నా చేపట్టాలని నిర్ణయించారు. కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపేందుకు పోలీసుల నుంచి అనుమతి తీసుకున్నారు. అయినా, కడప, కర్నూలు జిల్లాల్లో ఎక్కడికక్కడ ఏపీయూడబ్ల్యూజే నాయకులను నిర్బంధించడాన్ని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు తీవ్రంగా ఖండించారు. చలో అనంతపురం కార్యక్రమానికి జర్నలిస్టులు హాజరయ్యే విధంగా కర్నూలు, కడప జిల్లాల పోలీసులు సహకరించాలని ఆయన కోరారు.





కర్నూలు జిల్లా మంత్రాలయంలో ఏపీయూడబ్ల్యూజే తాలూకా అధ్యక్షుడు, ఆంధ్రజ్యోతి విలేకరి జయరాజును అదుపులోకి తీసుకుని నోటీసులు ఇస్తున్న ఎస్ఐ

గొట్లూరులో దొంగ ఓట్లు

- పెళ్లయిన వారి ఓట్లు తొలగించాలని టీడీపీ ఫిర్యాదు
- డబుల్, షిఫ్టింగ్ ఓట్లు జాబితాలో ఉంచిన వైనం
- అధికార పార్టీ వారివి తొలగించని బీఎల్ఓలు

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి 21: ఓటరు జాబితాలో అవకతవకలు జరిగాయని గత ఏడాది సెప్టెంబరులో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బీఎల్ఓలు, ప్రతిపక్ష పార్టీలు ఇంటింటికీ తిరిగి సర్వే చేశారు. ఈ సర్వేలో డబుల్, మరణించిన ఓట్లు, పెళ్లయిన వారి ఓట్లను గుర్తించి అధికారులకు అందజేశారు. వాటిని తొలగించాలని వారి వివరాలతో కూడిన పత్రాలను అందజేశారు. అయితే ఆ ఓటర్లు అధికారపార్టీ సంబంధించినవి కావడంతో జాబితాలో అలానే ఉంచారని ప్రతిపక్షాలు తెలుపుతున్నాయి. ఎన్నికల కమిషన్ ఆదేశాలను లెక్కచేయకుండా బేఖాతర్ చేస్తూ బీఎల్ఓలు సర్వేలో చూపించినా ఆ ఓట్లను తొలగించకుండా ముసాయిదా ఓటరు జాబితాలో అలాగే రావడంతో ఇంతమాత్రానికి ఎందుకు సర్వేచేయాలని ప్రతిపక్షపార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితాలో కూడా ఇబ్బడిముబ్బడిగా డబుల్ ఓట్లు, దొంగ ఓట్లు, మరణించిన వారి ఓట్లు బయటపడుతున్నాయి. ఇలాంటి ఓట్లే ధర్మవరం మండలంలోని గొట్లూరు గ్రామంలో వెలుగులోకి వచ్చాయి.



వరలక్ష్మి పేరుమీద తొలగించిన ఓటు, మళ్లీ అదే బూత్‌లో డబుల్ ఓట్లు

- గొట్లూరు గ్రామంలో 145, 146 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఈ రెండు కేంద్రాల్లోనూ అదేగ్రామానికి చెందిన కొంతమంది రెండు కేంద్రాల్లో ఓట్లు నమోదు చేయించుకుని ఉండటంతో ఆ ఓట్లన్నీ మళ్లీ దర్శనమిచ్చాయి. ముసాయిదా ఓటరు జాబితాలో మళ్లీ రావడంతో ప్రతిపక్షపార్టీ అభ్యంతరం వ్యక్తం చేసింది.

గ్రామంలో లేని ఓట్లతో వైసీపీ కొత్త డ్రామా!

గొట్లూరు గ్రామంలో పోలింగ్ కేంద్రం 145లో సీరియల్ నెంబర్ 1146 త్రివేణి చలసాని, 1196లో సునీత, 1197లో పద్మజ జ్వాల, 1198లో దేవి జ్వాల, 1254లో వరలక్ష్మీ అనే ఓటర్లు అందరూ పెళ్లయి వేరే గ్రామాలకు వెళ్లిపోయారు. మళ్లీ 1194 వరలక్ష్మీ పేరు మీద ఓటు వచ్చింది. అలాగే 562లో వరలక్ష్మీ పేరు మీద డీలీషన్ లిస్టులో వచ్చింది. వీరందరికీ వివాహం అయి వేర్వేరు గ్రామాల్లో నివాసం ఉంటున్నారు. వరలక్ష్మీ అనే ఓటరు సంబంధించి తండ్రి పేరు, భర్త పేరుతో డబుల్ ఎంట్రీ చేశారు. ఈ ఓటు తొలగించాలని గతంలో ఇంటింటి సర్వేలో కూడా బీఎల్ఏలు బీఎల్ఓలకు పక్కాఆధారాలతో అందించారు. ఆ ఓటును తొలగించకుండా బీఎల్ఓ మళ్లీ డబుల్ ఓటు ఎక్కించారు. ఈ ఓట్లుపై అదేగ్రామానికి చెందిన టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు నారాయణస్వామి సూచనలు మేరకు తొలగించాలని ఫిర్యాదు చేశారు. అయితే నారాయణస్వామి ఓ కేసులో ధర్మవరం సబ్ జైలులో రిమాండ్‌లో ఉన్నాడు. దీనిపై వైసీపీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ రిమాండ్‌లో ఉన్న వ్యక్తి ఎలా ఫిర్యాదు చేశాడంటూ ఆయనపై చర్యలు తీసుకోవాలని అధికారులకు ఫిర్యాదు చేశారు. అదేగ్రామానికి చెందిన మరో వ్యక్తి జైలు వద్దకు ములాఖాత్‌కు వెళ్లినప్పుడు నారాయణస్వామి గతంలో తాను ఫిర్యాదు చేసిన ఓట్లను తొలగించారా లేదా చూసుకుని మళ్లీ ఫారం-7లో ఫిర్యాదు చేయాలని సూచించారు. అందుకు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు బీఎల్ఓ వద్దకు వెళ్లగానే వెంటనే ఆ సమాచారాన్ని అధికారపార్టీకి చేరవేసినట్లు తెలుస్తోంది. దీంతో అధికారపార్టీ నాయకులు అతనిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని అధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.



వివాహం అయి వేరేప్రాంతాల్లో నివసిస్తున్న బి.సునీత, పద్మజ జ్వాల

ఇంటింటా సర్వే చేసినా మారని బీఎల్ఓలు

గతేడాది సెప్టెంబరు, నవంబరు నెలల్లో డబుల్, డెత్, షిఫ్టింగ్ ఓట్లు తొలగించాలని ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాజకీయ పార్టీల బీఎల్ఏలతో కలిసి బీఎల్ఓలు ఇంటింటా సర్వే చేశారు. ఈ సర్వేలో ఆధారాలతో సహా బీఎల్ఏలు బీఎల్ఓలకు అందించారు. అయినా వాటిని తొలగించకుండా మళ్లీ జాబితాలో అవే వచ్చేలా చేశారు. దీంతో ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. విధులను ఉల్లంఘిస్తున్న బీఎల్ఓలపై జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఆర్డీఓకు టీడీపీ నాయకుల ఫిర్యాదు

గొట్లూరులో ఓట్ల అవకతవకలపై బుధవారం టీడీపీ నాయకులు ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డికి వినతిపత్రం అందించారు. జైలులో ఉన్న నారాయణస్వామి గ్రామంలో లేని ఓట్లను నాపేరు మీద ఫారం7 దరఖాస్తు చేసి తొలగించాలని అదేగ్రామానికి చెందిన గిరక చంద్రశేఖర్‌కు చెప్పాడని, ఆయన సూచన మేరకు ఫారం7 దరఖాస్తు చేశామని దీంతో ఓట్ల అవకతవకలపై ఓ కమిటీ వేసి విచారణ చేసి తొలగించాలని కోరారు. తప్పుచేసే ప్రతి బీఎల్ఓలపై చర్యలు తీసుకోవాలని ఆర్డీఓను కోరారు. అలాగే గొట్లూరు గ్రామంలో ఇబ్బడి ముబ్బడిగా దొంగ ఓట్లు, డబుల్ ఓట్లు ఉన్నాయని వాటిని తొలగించాలని ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లారు. ఆర్డీఓ స్పందిస్తూ ఫిర్యాదులో ఇచ్చిన ఓట్లను పరిశీలించి తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వినతిపత్రం అందించిన వారిలో టీడీపీ నాయకులు పురుషోత్తంగౌడ్, మాజీ జడ్పీటీసీ మేకల రామాంజనేయులు, తలారిచంద్రమోహన్, విజయసారథి, విజయ్‌చౌదరి, రాంపురం శీనా, అమరేంద్ర, చిరంజీవి, చంద్రశేఖర్, అశోక్ ఉన్నారు.



ఆర్డీఓకు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

రోడ్డు ప్రమాదంలో ఎస్ఐ దుర్మరణం

మరో ఇద్దరు కూడా...



ఎస్ఐ ఎస్‌వీ రమణ (ఫైల్)



పవన్‌సాయి (ఫైల్)

అనంతపురం క్రైం/ భూత్పూర్ (మహబూబ్‌నగర్), ఫిబ్రవరి 21: అతివేగంగా వెళుతూ అదుపుతప్పిన కారు చెట్టును ఢీకొన్న సంఘటనలో ముగ్గురు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మృతుల్లో జిల్లా వాసి, ప్యాపిలి ఎస్ఐ రాచర్ల వెంకటరమణ (55), అల్లుడు పవన్‌సాయి (25), కారు డ్రైవర్ చంద్ర (27) ఉన్నారు. ఈ సంఘటన బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలంలోని 44వ నెంబరు జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. నంబూరి వెంకటరమణ తన కుటుంబంతో అనంతపురంలోని షిర్డీనగర్‌లో నివాసం ఉండేవారు. ప్రస్తుతం ఈయన నంద్యాల జిల్లాలోని ప్యాపిలిలో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నాడు. ఆయన కూతురు అనూషకు హైదరాబాద్‌లోని మనికొండకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీరు పవన్‌సాయికి ఇచ్చి ఈ నెల 15న వివాహం జరిపించారు. ఈ నెల 20న హైదరాబాద్‌లోని వరుడి ఇంటి దగ్గర నిర్వహించిన విందుకు ఎస్ఐ వెంకటరమణ కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. తిరిగి బుధవారం ఉదయం హైదరాబాద్ నుంచి ఎస్ఐ వెంకటరమణ, అతని కూతురు అనూష, అల్లుడు పవన్‌సాయి, కారు డ్రైవర్ చంద్ర కలిసి షిఫ్ట్ కారులో అనంతపురానికి బయలుదేరారు. భూత్పూర్ మండలంలోని అన్నసాగర్ గ్రామం సమీపంలోకి రాగానే వీరు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ఈ సంఘటనలో ఎస్ఐ వెంకటరమణ (55), అల్లుడు పవన్‌సాయి (25), కారు డ్రైవర్ చంద్ర (27) అక్కడికక్కడే మరణించారు. అనూషకు తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన అనూషను మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వివాహం జరిగిన వారం రోజులకే పవన్‌సాయి మరణించడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. కాగా, వెంకటరమణ గతంలో జిల్లాలో హెడ్‌కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐ వరకు వివిధ పోలీస్‌స్టేషన్లలో పనిచేశారు.

పరిశ్రమలో ప్రమాదం

- వేడిద్రవం పడి ఏడుగురికి గాయాలు

హిందూపురం, ఫిబ్రవరి 21: మండలం గోళ్లాపురం పారిశ్రామికవాడలో ఉన్న కుబేర స్టీల్స్ పరిశ్రమలో బుధవారం ఉదయం ప్రమాదం చోటుచేసుకుని ఏడుగురికి గాయాలైన సంఘటన చోటు చేసుకుంది. అందులో పనిచేస్తున్న ఇతర కార్మికులు తెలిపిన వివరాల మేరకు పరిశ్రమలోపల గుజిరీని కరిగించే బాయిలర్‌లోకి ఖాళీ డ్రమ్ములు వేశారు. అయితే అందులో గ్యాస్ ఉండటంతో అవి పగిలి దగ్గరలో పనిచేస్తున్న కార్మికులపై వేడి ద్రవం పడింది. సంఘటనలో యూపీ, మధ్యప్రదేశ్‌కు చెందిన క్రిష్ణ, సోలాం, పంచరత్నన్, ప్రవీణ్‌కుమార్, డింపుల్ కుమార్, బిట్టప్ప, త్రిభువన్‌లకు గాయాలయ్యాయి. వీరిని హిందూపురం ఆసుపత్రికి తరలించకుండా ప్రైవేటు వాహనంలో కర్ణాటకలోని గౌరీబిదనూరు ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు. ప్రమాద విషయాలు తెలుసుకున్న కార్మిక సంఘం నాయకులు రవికుమార్, ఏఐటీయూసీ నాయకులు వినోద్, సురేష్ గౌరీబిదనూరు ఆసుపత్రికి వెళ్లి గాయపడ్డ వారి వివరాలను ఆరాతీశారు. బాయిలర్ వద్ద డ్రమ్ములు పగిలి బయటపడి అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో కొంత ఆస్తినష్టం జరిగినట్లు తెలిసింది.

పకడ్బందీగా ఓటరు ఫిర్యాదుల పరిశీలన

అనంతపురం టౌన్ ఫిబ్రవరి 21: ఓటరు జాబితాపై వచ్చిన ఫిర్యాదులను పగడ్బందీగా పరిశీలిస్తున్నట్లు కలెక్టరు గౌతమి రాజకీయ పార్టీల నాయకులకు తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో ఎన్నికల నిర్వహణ, ఓటరు జాబితాపై వచ్చిన ఫిర్యాదులు, వాటి పరిష్కారం కోసం తీసుకున్న చర్యలు.. తదితర వాటిపై రాజకీయ పార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఓటరు జాబితా విడుదల చేసిన తర్వాత ఇచ్చిన ఫారం 6,7,8 లను నిబంధనల మేరకు పక్కాగా పరిశీలిస్తున్నామన్నారు. ఫారం 6,8లకు సంబంధించి ఎలాంటి సమస్యా లేదని, ఫారం-7కు సంబంధించి వచ్చిన డెత్ కేసులు, డూప్లికేట్ ఓట్లపై ఫిర్యాదులను పరిశీలిస్తున్నామని అన్నారు. సమావేశంలో డీఆర్ఓ రామక్రిష్ణారెడ్డి, టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్, సీపీఐఎం, బీజేపీ, ఆమ్ ఆద్మీ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

దాడులపై సీఎం స్పందించకపోవడం విడ్డూరం

- శ్రీపీఠం పీఠాధిపతి



పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 21: బీసీలకు పెద్దపీట వేశామని చెబుతున్న వైసీపీ ప్రభుత్వం వారిపైనే దాడులు చేస్తున్నా స్పందించకపోవడం విడ్డూరంగా ఉందని కాకినాడ శ్రీపీఠం పీఠాధిపతి పరిపూర్ణానంద స్వామి పేర్కొన్నారు. దాడులకు సీఎం జగన్ మద్దతు పలుకుతున్నారని ఆరోపించారు. పెనుకొండలోని బీజేపీ క్యాంపు కార్యాలయంలో పరిపూర్ణానందస్వామి బుధవారం మాట్లాడుతూ.. రాప్తాడు సిద్ధం సభలో విధి నిర్వహణలో ఉన్న ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణను విచక్షణా రహితంగా కొట్టడం, కాళ్లతో తన్నడం దారుణమన్నారు. సాక్షాత్తూ సీఎం సభలో ఒక వ్యక్తిని ఇంతగా కొట్టడం, సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నా.. ఇంతవరకు ముఖ్యమంత్రి స్పందించకపోవడం శోచనీయమన్నారు. బీసీ సామాజికవర్గానికి పెద్దపీట వేస్తామని అధికార వైసీపీ గొప్పలు చెబుతోందన్నారు. మత్స్యకార కుటుంబానికి చెందిన ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణ బీసీ కాదా అని ప్రశ్నించారు. దాడిచేసిన వారిని గుర్తించి, వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

రాక్షస చర్య: గోనుగుంట్ల


ధర్మవరం: ప్రభుత్వ దౌర్జన్యాలను వెలికితీస్తే పాత్రికేయులపై దాడులు చేస్తారా అంటూ మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక వ్యక్తిగత కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. రాప్తాడు సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై, కర్నూలులో ఈనాడు కార్యాలయంపై వైసీపీ మూకల దాడులకు పాల్పడటం రాక్షస చర్యగా అభివర్ణించారు.

పది పరీక్షల పరిశీలకుడిగా ఆర్‌జేడీ

అనంతపురం విద్య, ఫిబ్రవరి 21: ఉమ్మడి అనంతపురం జిల్లా పదో తరగతి పరీక్షల జిల్లా పరిశీలకుడిగా పాఠశాల విద్య కడప ఆర్‌జేడీ రాఘవరెడ్డిని నియమించారు. 10వ తరగతి పరీక్షల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాలకు పదో తరగతి పరిశీలకులుగా విద్యాశాఖలోని సీనియర్ అధికారులను నియమించారు. అనంతపురం, సత్యసాయి జిల్లాల పరిశీలకుడిగా ఆయనను నియమిస్తూ ఇటీవల విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. పదో తరగతి పరీక్షలు సజావుగా జరిగేలా పర్యవేక్షించేందుకు వీరిని నియమించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

శ్రీకృష్ణపై దాడికి నిరసనగా 24న దీక్ష

- బెస్త సేవాసంఘం నాయకులు



మాట్లాడుతున్న బెస్త సేవా సంఘం నాయకులు

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 21: ఫొటోగ్రాఫర్ బెస్త శ్రీకృష్ణపై వైసీపీ మూకల దాడిని వ్యతిరేకిస్తూ ఈనెల 24న కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్ష చేపడుతున్నట్లు బెస్తసేవా సంఘం నాయకులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో బెస్త సాధికార సమితి రాష్ట్ర డైరెక్టర్ చేపల హరి, బెస్త సేవా సంఘం నాయకుడు కేవీ రమణ మీడియాతో మాట్లాడారు. బెస్త కృష్ణపై దాడి చేసిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటివి పునరావృతం కాకుండా పోలీసులు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నాయకులు భాస్కర్, నాగరాజు, గంగన్న, శ్రీనివాస్, నరసప్ప, కుళ్లాయప్ప, సురేష్, బాలన్న, మారుతి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

26న కాంగ్రెస్ భారీ బహిరంగ సభ

- సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి



మాట్లాడుతున్న పీసీసీ మాజీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 21: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 26వ తేదీన జిల్లా కేంద్రంలోని న్యూటౌన్ జూనియర్ కళాశాల మైదానంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసినట్లు పీసీసీ మాజీ అధ్యక్షుడు, సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన కళాశాల మైదానాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. సోమవారం పెద్దఎత్తున బహిరంగ సభ ఏర్పాటు చేశామని, అతిథులుగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పీసీసీ అధ్యక్షులు షర్మిల హాజరవుతారని తెలిపారు. ఇక్కడి నుంచే కాంగ్రెస్ పార్టీ ఎన్నికల శంఖారావాన్ని పూరిస్తుందన్నారు. రాష్ట్రంలో, దేశంలో ఒకేసారి ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఏమి చేయబోతున్నది సభలో చెబుతామన్నారు. పార్టీ బలంగా ఉన్నప్పుడే రాష్ట్రానికి మేలు జరుగుతుందన్నారు. 50 వేల మందితో సమావేశం ఏర్పాటు చేసేలా ప్రణాళికలు చేశామన్నారు. అంతకంటే ఎక్కువ వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ సభే కాకుండా మరో 4 సభలు నిర్వహిస్తామన్నారు. పోలవరం ప్రాజెక్ట్, విశాఖ ఉక్కు, రాజధాని, ప్రత్యేక హోదా తదితర విభజన హామీలపై సమావేశంలో వివరిస్తామన్నారు. సమావేశాలకు తెలంగాణ ముఖ్యమంత్రితో పాటు కర్ణాటక ముఖ్యమంత్రి హాజరవుతారన్నారు. అలాగే రాప్తాడులో జరిగిన సిద్ధం సభకు సంబంధించి ప్రతి బస్సుకు రూ.20 వేలు ఇచ్చారని, దాన్ని అధికారులతో పాటు వలంటీర్లు వాడుకున్నారని వచ్చిన వారు చెప్పారన్నారు. అసలు ఇది ప్రభుత్వ సభా, పార్టీ సభ అన్నది అర్థం కావడం లేదన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్, మైనార్టీ విభాగం అధ్యక్షుడు దాదాగాంధీ, జిల్లా అధ్యక్షుడు బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డి, నాయకులు రవికృప, రామానాయుడు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే బల ప్రదర్శన

- సీఎం జగన్‌పై శైలజానాథ్ విమర్శలు
- మీడియాపై దాడులు నీచం అంటూ ధ్వజం



మాట్లాడుతున్న శైలజానాథ్

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 21: సీఎం జగన్‌కు ఓటమి భయం పట్టుకుందనీ, అందుకే సిద్ధం సభల పేరుతో బల ప్రదర్శనకు దిగుతున్నారని పీసీసీ మాజీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్ పేర్కొన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ.. రాప్తాడులో గంట సిద్ధం సభ కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేసి జన సమీకరణ చేశారన్నారు. డబ్బు, మద్యంతో ప్రజలను మభ్యపెట్టలేరన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు బస్సులు లేకుండా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. ఏ ప్రభుత్వమైనా ప్రజలకు అనుకూలంగా నడుచుకోవాలి తప్ప.. ఇబ్బందులు పెట్టకూడదన్నారు. రాప్తాడు సిద్ధం సభలో ఉమ్మడి అనంత ప్రజల బాగోగులు గురించి ఒక్క మాటైనా మాట్లాడావా అంటూ ముఖ్యమంత్రిని నిలదీశారు. ఓటమి భయంతోనే జగన్ భయపెట్టే ధోరణి ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. అందులో భాగంగా వైసీపీ అరాచకాలను బయటి ప్రపంచానికి చెబుతున్న మీడియాపై దాడు లు చేయిస్తున్నారన్నారు. రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై, కర్నూలులో ఈనాడు కార్యాలయంపై దాడులు అందులో భాగమేనన్నారు. మీడియాపై దాడులు నీచమన్నారు. మొదట ఎమ్మెల్యేలను ఇష్టారాజ్యంగా తరిమేసిన జగన్.. ఇప్పుడు భయంతో బతిమాలి మళ్లీ పార్టీలోకి తీసుకునేందుకు మధ్యవర్తిత్వం నడుపుతున్నారంటూ ఎద్దేవా చేశారు. మాయల ఫకీరు ప్రాణం చిలుకలో ఉన్నట్టు జగన్ ప్రాణం కాంగ్రెస్ పార్టీలో ఉందన్నారు. జగన్ సోదరి పీసీసీ ప్రస్తుత అధ్యక్షురాలు షర్మిల కాంగ్రెస్ పార్టీ పగ్గాలు చేపట్టగానే ఆయన కళ్లలో భయం కనిపిస్తోందన్నారు. ఇక, ఈనెల 26న అనంతపురంలో నిర్వహించ తలపెట్టిన సభకు ఏఐసీసీ పెద్దలు రానున్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గౌతమ్, పెనుకొండ ఇన్‌చార్జి కేటీ శ్రీధర్, రాష్ట్ర కార్యదర్శి కాలవ సరిత పాల్గొన్నారు.

జిల్లాలో బర్డ్‌ఫ్లూ లేదు

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 21: జిల్లాలో బర్డ్‌ఫ్లూ లేదని పశుసంవర్ధక శాఖ జేడీ సుబ్రహ్మణ్యం ప్రకటనలో స్పష్టం చేశారు. జిల్లాలోని కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకిందని వస్తున్న వదంతులను నమ్మవద్దన్నారు. క్షేత్రస్థాయిలో పశువైద్యులతో పరీక్షలు చేయించామని, జిల్లాలో ఎక్కడా బర్డ్‌ఫ్లూ సోకలేదని తేలిందని అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జకీవుల్లా

టీడీపీ గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం..!

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 21: వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేద్దామని టీడీపీ రాష్ట్ర నాయకుడు కే.ఎంజకీవుల్లా పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని రాజీవ్ కాలనీ పంచాయతీలో పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశం అయ్యారు. ఆయన మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వ అరాచకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇంటింటా తిరుగుతూ టీడీపీ హయంలో జరిగిన అభివృద్ధి వివరించాలన్నారు. కార్యక్రమంలో మాజీ కాపు కార్పొరేషన్ డైరెక్టర్ రాయల్ మురళి, దేవంజినేయులు, టిఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మోహన్‌కుమార్, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కనుమ చౌడయ్య, జిల్లా టీడీపీ మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి జిలాన్ బాషా, కేశవరాయల్, జయరాంనాయక్, మాధవ్‌యాదవ్, పరమేష్, కాటమయ్య, గోపాల్, అంజి, చంద్రశేఖర్, రామాంజి, వెంకటేష్, అనిల్, నారాయణస్వామి, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 21: పదో తరగతి పరీక్షల నేపథ్యంలో పేద విద్యార్థులకు పరీక్షా సమగ్రిని గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మొద్దీన్ పంపిణీ చేశారు. బుధవారం రాజేంద్ర మున్సిపల్ హైస్కూల్, శ్రీ కృష్ణదేవరాయ హైస్కూల్, కస్తూరిబాయి ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు పరీక్ష ప్యాడ్, పెన్నులు, స్కేల్ ఇతర సామగ్రి అందించారు.



పరీక్షా సామగ్రి అందజేస్తున్న గౌస్‌మొద్దీన్

శ్రీ కృష్ణను పరామర్శించిన గడ్డం సుబ్రహ్మణ్యం

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 21: వైసీపీ మూకల దాడిలో తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆంధ్రజ్యోతి ఫొటో గ్రాఫర్ శ్రీ కృష్ణను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గడ్డం సుబ్రహ్మణ్యం బుధవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య విషయాలపై ఆరా తీశారు. దాడి చేసిన వైసీపీ అల్లరి మూకలపై హత్యాయత్నం కేసు నమోదు చేసి, తక్షణమే అరెస్టు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

రామగిరి, ఫిబ్రవరి 21: మండలంలో పేరూరు పంచాయతీ పెదయ్యగారికొట్టాల గ్రామానికి చెందిన వేపచెర్ల రమాదేవి (28) విద్యుదాఘాతంతో బుధవారం మరణించింది. ఇంటిలోని బాత్‌రూంలో విద్యుత్ వైరు కట్ అయి డోర్‌కు విద్యుత్ సరఫరా అయింది. ఇది గమనించక ఆమె తలుపులు ముట్టుకోవడంతో షాక్ గురైంది. ఆమె భర్త అక్కులప్ప వెంటనే ఫ్యూజ్ ఆఫ్ చేశాడు. అప్పటికే రమాదేవి మరణించినట్లు గుర్తించాడు. రమాదేవి కుమారుడు రేవంత్, కుమార్తె మధులిక ఉన్నారు. మృతదేహాన్ని ధర్మవరం ఆస్పత్రికి తరలించిన పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతూ రైతు..

బుక్కరాయసముద్రం, ఫిబ్రవరి 21: విద్యుదాఘాతంతో తీవ్రంగా గాయపడి బెంగళూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని చెన్నంపల్లి గ్రామ రైతు ఉడమల నాగభూషణం (44) బుధవారం మరణించారు. ఆయన ఈ నెల19న తన పొలంలో విద్యుత్ స్టార్టర్ పెట్టెను ఆన్ చేస్తుండగా.. షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. అతనికి అనంతపురం సర్వజన ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరు తరలించారు. కోలుకోలేక ఆయన మరణించాడు. నాగభూషణంకు భార్య, ఒక కుమారుడు ఉన్నారు. బుక్కరాయసముద్రం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు...

అనంతపురం క్రైం / శింగనమల ఫిబ్రవరి 21: అనంతపురం నగర సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో శింగనమల మండలం ఏకులనాగేపల్లి గ్రామానికి చెందిన బోయ మనోజ్‌కుమార్ (18) మరణించారు. ఇతను ఏసీ మెకానిక్. రోజూ ఏకులనాగేపల్లి నుంచి అనంతపురానికి వచ్చి వెళ్లేవాడు. బుధవారం ఇతను బైక్‌పై నగరానికి వస్తుండగా.. అంజనేయ టింబర్ డిపో వద్ద గుత్తి నుంచి అనంతపురం నగరంలోకి వచ్చే లారీ కిందపడి అక్కడి కక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోలీసులు అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు మనోజ్‌కుమార్ మృతదేహానికి నివాళులర్పించారు. అంత్యక్రియలకు రూ.10 వేల ఆర్థిక సాయన్ని అందజేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళా వలంటీర్ ఆత్మహత్య

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 21: నగరంలో ఓ మహిళా వలంటీర్ ఆత్మహత్య చేసుకుంది. స్థానిక రామకృష్ణ కాలనీలో దేవరకొండ లలిత (34), భర్త రామ్మోహన్ నివాసముంటున్నారు. లలిత వలంటీర్‌గా పనిచేస్తుండగా, భర్త రామకృష్ణ కూలి పనిచేస్తుంటాడు. వారికి పిల్లలు కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెందిన ఆమె మంగళవారం రాత్రి బుడ్డప్పనగర్ సమీపంలోని డ్రైవర్స్ కాలనీలో ఉంటున్న బంధువు హరీష్ ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు.

రూ.2 లక్షల బీమా నగదు అందజేత

రాప్తాడు, ఫిబ్రవరి 21: మండలంలోని ఎం. చెర్లోపల్లి పంచాయతీ పాలబావి గ్రామానికి చెందిన పోతన్న రెండు నెలల క్రితం అనారోగ్యంతో మరణించాడు. దీంతో పోతన్న కుటుంబ సభ్యులకు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు తరపున బీమా సొమ్ము రూ.2 లక్షలు అందజేసినట్లు మేనేజర్ అమర్‌నాథ్‌రెడ్డి బుధవారం తెలిపారు. పోతన్న బండమీదపల్లి గ్రామీణ బ్యాంకులో ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన కింద ప్రతి ఏడాది రూ.436 చెల్లించేవాడన్నారు. కార్యక్రమంలో క్యాష్ ఇయర్ తిరుమల నాయక్ పాల్గొన్నారు.

25న హాకీ క్రీడాకారుల ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 21: జిల్లా స్థాయి సీనియర్ మహిళ జట్టుకు క్రీడాకరుల ఎంపిక పోటీలను అనంత క్రీడాగ్రామం ఆర్డీటీ స్టేడియం లో ఆదివారం నిర్వహిస్తున్నట్లు జిల్లా హాకీ అనంతపురం కార్యదర్శి అనీల్‌కు మార్ తెలిపారు. ఆసక్తి, అర్హతగల క్రీడాకారులు ఆధార్, పదో తరగతి మార్కుల జాబితా, జనన ధ్రువీకరణపత్రం, యూనిఫాం, క్రీడా సామగ్రితో హాజరుకావాలన్నారు. ఎంపికైన వారు మార్చి 8 నుంచి 10 వరకు ప్రకాశం జిల్లా మైనంపాడులో నిర్వహించే 14వ రాష్ట్ర సీనియర్ మహిళల హాకీ చాంపి యన్ షిప్ పోటీల్లో పాల్గొంటారన్నారు. వివరాలకు 94900 33474ను సంప్రదించాలని ఆయన సూచించారు.

అధికారంలోకి రాగానే..

అనంతకు అండర్ డ్రైనేజీ

మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 21: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే అనంతపురం నగరంలో అండర్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి పేర్కొన్నారు. బుధవారం స్థానిక 37వ డివిజన్‌లో ఇంటింటికి వెళ్లి టీడీపీ హయాంలో చేసిన అభివృద్ధి, సంక్షేమం, వైసీపీ పాలనలో వైఫల్యాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ చౌదరి మాట్లాడుతూ... వైసీపీ పాలనలో దోచుకోవడం.. దాచుకోవడం తప్పా చేసిందేమి లేదని విమర్శించారు. వైసీపీ నేతల అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. రాబోవు ఎన్నికల్లో టీడీపీ, జనసేన బలపర్చిన అభ్యర్థిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తలారి ఆదినారాయణ, దేవళ్ల మురళీ, సాలార్ బాషా, రాజీవ్‌రెడ్డి, డిష్ నాగరాజు, సరిపూటి రమణ, నటేష్ చౌదరి, నారాయణ స్వామి యాదవ్, పీఎం లక్ష్మీప్రసాద్, మారుతీ కుమార్ గౌడ్, పోతుల లక్ష్మీనరసింహులు, సైపుద్దీన్, రాజారావు, సుధాకర్ యాదవ్, గోపాల్ గౌడ్, బాలప్ప, మార్కెట్ మహేష్, ముక్తియార్, జేఎం బాషా, కడియాల కొండన్న, మల్లికార్జున, తెలుగు మహిళలు స్వప్న, శివ బాల, విజయశ్రీరెడ్డి, సంగా తేజస్విని, సరళ, జానకి, సుజాత,కృష్ణవేణి,వసుంధర, హసీనా, షరీనా, మణెమ్మ, రాధ, సువర్ణ పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న ప్రభాకర్ చౌదరి

నేటి నుంచి జేఎన్‌టీయూలో న్యాక్ కమిటీ పర్యటన





జిమ్, ఈఈఈ విభాగాలను ముస్తాబు చేస్తున్న కార్మికులు

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 21: నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) గుర్తింపునకు జేఎన్‌టీయూ ఆరు నెలల క్రితం దరఖాస్తు చేసుకుంది. దీంతో న్యాక్ పీర్ కమిటీ గురువారం వర్సిటీకి రానుంది. మూడు రోజుల పాటు కమిటీ సభ్యులు వర్సిటీలో పర్యటిస్తారు. దీంతో వర్సిటీ, కళాశాలలో వారం నుంచి అభివృద్ధి పనులు జోరందుకున్నాయి. జేఎన్‌టీయూలో ల్యాబ్స్, వర్క్‌షాప్స్, క్లాస్ రూమ్స్, హాస్టల్స్, సెమినార్ హాల్స్, జిమ్, పవర్ రూమ్, ఇండోర్ స్టేడియం, గ్రౌండ్ ఇలా అన్ని విభాగాలను ముస్తాబు చేస్తున్నారు. న్యాక్ దరఖాస్తులో పొందుపరిచిన అంశాలను ప్రజెంటేష్ రూపంలో కమిటీ సభ్యులకు వివరించేందుకు ఏర్పాట్లు చేశారు. వందలాది మొక్కలు తెప్పించి వర్సిటీ ఆవరణాన్ని సుందరీకరిస్తున్నారు. అదే విధంగా భవనాలకు రంగులు వేస్తూ కొత్తశోభను సంత రింపచేశారు. యంత్రాలతో కళాశాల ఆవర ణాన్ని చదును చేయిస్తూ ట్రాక్టర్లతో మట్టిని తోలించి మొక్కలు నాటిస్తున్నారు. మరోవైపు ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, ఉమెన్ ఎంపవర్‌మెంట్, స్పోర్ట్స్ విభాగాల ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మొత్తంగా న్యాక్ కమిటీ రాకతో వర్సిటీ ముస్తాబైంది.

మంచి గ్రేడ్ సాధిస్తాం...

న్యాక్‌లో మంచి గ్రేడ్‌ను సాధిస్తామన్న నమ్మక ముంది. అందుకు తగిన కసరత్తు ప్రారంభించి పూర్తిచేశాము. ప్రొఫెసర్ల నుంచి స్వీపర్‌ల వరకు అందరూ శ్రమించి వర్సిటీకి ఒక నూతన రూపాన్ని తీసుకువచ్చాం. 77 సంవత్సరాల్లో ఎన్నో ఘనతలు సాధించిన జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల సాంకేతిక విద్యనందించి విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది. న్యాక్‌లో గ్రేడ్ ఏప్లస్ వస్తే ఫండింగ్ ఏజెన్సీలు ముందుకు వచ్చేందుకు అవకాశాలున్నాయి.

ప్రొఫెసర్ శ్రీనివాసరావు, జేఎన్‌టీయూ వీసీ

వే బ్రిడ్జిలు ఏర్పాటు చేయాలి

రాప్తాడు, ఫిబ్రవరి 21: ఇసుక రీచ్‌లు, కంకర క్వారీల వద్ద వే బ్రిడ్జి (తూకం యంత్రాలు) ఏర్పాటు చేయాలని టిప్పర్ సంఘం జిల్లా సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం రాప్తాడు సమీపంలో ఆటో నగర్ వద్ద టిప్పర్లతో ధర్నా నిర్వహించి రూరల్ డీఎస్పీ వెంకటశివారెడ్డికి ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ... లోడ్ కచ్చితంగా వేసుకుని వస్తున్నా రహదారుల్లో ఆర్టీఓ, విజిలెన్స్ అధికారులు టిప్పర్లు ఆపి అధిక లోడుతో వెలుతున్నారని రూ. 60 నుంచి 80 వేల వరకూ జరిమానా విధిస్తున్నారని వాపోయారు. అన్ని రికార్డులు ఉన్నా వేలల్లో జరిమానా విధిస్తున్నారన్నారు. ఇసుక, కంకర క్వారీల వద్ద వే బ్రిడ్జిలు ఏర్పాటు చేసి తూకం వేసిన తరువాతే లోడ్ చేయాలన్నారు. అధికారులు స్పందించకుంటే... కలెక్టర్ వద్ద ఆందోళన నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఈ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆంజినేయులు, ఉపాధ్యక్షుడు తిరుపాలు, కార్యదర్శి చెన్నయ్య, ప్రధాన కార్యదర్శి నారాయణస్వామి, కోశాధికారి గురుమూర్తి పాల్గొన్నారు.



టిప్పర్లతో ధర్నా చేస్తున్న యజమానులు

ప్రజా ప్రభుత్వ స్థాపనకు కృషి చేయండి

'జనసేన జయభేరి'లో జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 21: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రభుత్వ స్థాపనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని జనసేన జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఆయన జనసేన జయభేరి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ముందుగా రామ్‌నగర్ లోని పార్టీ కార్యాలయం నుంచి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో వికలాంగుల కొట్టాల, అజయ్‌ఘోష్ కాలనీ వరకూ భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా టీసీ వరుణ్ మాట్లాడుతూ... కాలనీల్లో తిష్ట వేసిన సమస్యల గురించి తనకు తెలుసన్నారు. జనసేన, టీడీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఆ సమస్యలన్నింటిని పరిష్క రిస్తామన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో కాలనీల్లోని సమస్యలను అటకెక్కిం చింద న్నారు. ఆ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకు లు సైతం కాలనీల్లో పర్యటించి సమస్యలు తెలుసుకున్న పాపాన పోలేదన్నారు. కార్యక్రమంలో నగర అధ్యక్షు డు పొదిలి బాబురావు, జిల్లా ఉపాధ్యక్షుడు అంకె ఈశ్వరయ్య, జిల్లా ప్రధాన కార్యద ర్శులు పత్తి చంద్రశేఖర్, కుమ్మర నాగేంద్ర, జిల్లా కార్యదర్శులు రాపా ధనుంజయ, ముప్పూరి కృష్ణ, కిరణ్‌కుమార్, సిద్దు, అవుకు విజయ్ కుమార్, నాయకులు ఆకుల అశోక్, హరి, వరుణ్‌చౌదరి, సదానందం, మేదర వెంకటేష్, హుస్సేన్, దరాజ్ బాషా, కుమ్మర మురళీ, లాల్‌స్వామి, అంజి, సంపత్, నాగార్జున, వెంకటరమణ పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న టీసీ వరుణ్

కేంద్ర ప్రభుత్వ నిరంకుశత్వాన్ని ఖండించాలి

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 21: ఢిల్లీ రైతు ఉద్యమం పట్ల నరేంద్రమోడీ నిరంకుశత్వాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలని ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రైతులు పండించే పంటలకు మద్దతు ధరల చట్టం తీసుకురావాలని కోరుతూ రైతాంగం ఢిల్లీకి వెళ్లేందుకు శాంతియుతంగా నిర్వహిస్తున్న ప్రదర్శనపై హర్యానా రాష్ట్రం కానూరి సరిహద్దులో హర్యానా పోలీసులు సాగించిన దుర్మార్గమైన దాడిలో 24 సంవత్సరాల శుభ్‌కరణ్ సింగ్ అనే రైతు ఉద్యమకారుడు తీవ్ర గాయాలపాలై మృతిచెందాడన్నారు. రైతు ఉద్యమం పట్ల బీజేపీ, నరేంద్రమోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న దుర్మార్గమైన వైఖరికి ఇది నిదర్శనమన్నారు. యువరైతు మృతికి కారణమైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఉద్యమం సందర్భంగా ఇప్పటికే ఇద్దరు రైతులు గుండె ఆగి మరణించారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ రైతు వ్యతిరేక వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఢిల్లీ రైతు ఉద్యమం సందర్భంగా రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



లక్ష్మీనారాయణను పరామర్శిస్తున్న పరిటాల సునీత, శ్రీరామ్

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ టీడీపీ నాయకుడు

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి 21: కనగానపల్లి మండలంలోని నెమలివరం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు లక్ష్మీనారాయణ బుధవారం కనగానపల్లి సమీపంలో మారెమ్మస్వామి గుడి వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి పరిటాల సునీత, ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్ ఆసుపత్రికి వెళ్లి లక్ష్మీనారాయణను పరామర్శించారు. అనంతరం వైద్యఖర్చుల నిమిత్తం రూ.50 వేలు ఆర్థికసాయం అందించారు. మెరుగైన చికిత్స కోసం బెంగుళూరుకు తరలించి చికిత్సలు అందిస్తామని, అధైర్యపడవద్దని భరోసా ఇచ్చారు. ఆమె వెంట టీడీపీ మండల కన్వీనర్ యాతం పోతలయ్య, పరమేశప్ప, లెక్కల నారాయణ పాల్గొన్నారు.

శ్రీకృష్ణపై దాడి అమానుషం



శింగనమల తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న విలేకరులు

శింగనమల, ఫిబ్రవరి 21: ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి చేసిన వారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని శింగనమల మండల విలేకరులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బుధవారం శింగనమల తహసీల్దార్ శోభన్‌బాబుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల విలేకరులు నాగరాజు, రంగారెడ్డి ప్రసాద్ ముత్యాలప్ప, అంజనేయప్రసాద్, నరేష్, నాగరాజు పాల్గొన్నారు.

ఘనంగా శంకరమఠం వార్షికోత్సవం

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 21: శారదానగర్‌లోని శృంగేరి శంకరమఠం 29వ వార్షికోత్సవాన్ని మఠంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. శారదా మాతకు కుంకుమ, పసుపు జలాభిషేకం, ఫలపుష్పాభిషేకాలతో పాటు ప్రత్యేక అలంకరణలతో పూజలు నిర్వహించారు. అదేవిధంగా గణపతి, శంకరాచార్యుల మూల విరాట్‌లకు వివిధ అభిషేకాలు, పూజలు నిర్వహించారు. హోమ పూర్ణాహుతి, మహామంగళహారతి నివేదనానంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మఠం కార్యనిర్వహణాధికారి సత్యప్రసాద్, మోహన్, భక్తులు పాల్గొన్నారు.



అలంకరణలో శారదామాత

బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా పోతులయ్య

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 21: బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకర్రావు, రాయలసీమ అధ్యక్షుడు రమేష్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు జోగి రాజేంద్ర పోతులయ్య బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా పోతులయ్య బుధవారం నియమించారు. బీసీల ఐక్యత, అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని పోతులయ్య తెలిపారు.



ఘనంగా మాతృభాషా దినోత్సవం

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 21: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని సెంట్రల్ యూనివర్సిటీ, ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రసూల్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తెలుగు తల్లి విగ్రహానికి పూలమాలలు వేశారు. అదేవిధంగా సెంట్రల్ యూనివర్సిటీలో సాంస్కృతి, వక్తృత్వ పోటీలు నిర్వహించారు.



తెలుగు తల్లి విగ్రహం వద్ద విద్యార్థుల నినాదాలు

ఎస్కేయూకు రూ.20 కోట్ల నిధులు

అనంతపురం సెంట్రల్ : పీఎం ఉషా పథకం కింద ఎస్కేయూకి రూ.20 కోట్ల నిధులు మంజూరైనట్లు వీసీ హుస్సేన్‌రెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. కేంద్ర పరిశోధన భవనానికి రూ.5.75 కోట్లు. ఆడిటోరియం, కంప్యూటర్ సెంటర్, అతిథి గృహ మరమ్మతులకు రూ.40 కోట్లు, అకడమిక్ అండ్ రీసర్చ్ పరికరాలకు రూ.8.5 కోట్లు, సాఫ్ట్ కాంపోనెంట్‌కు రూ.1.75 కోట్లు వెచ్చించనున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు నియమాలు పాటించండి

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 21: ప్రతిఒక్కరూ రోడ్డు నియమాలు పాటించాలని ఎస్పీ అన్బురాజన్ సూచించారు. సామాజిక కార్యకర్త, టీడీపీ యువ నాయకుడు రాచానపల్లి మంజు రూపొందించిన 'ట్రాఫిక్ నియమాలు పాటించండి.. సురక్షిత ప్రయాణాన్ని సాగించండి' అనే పోస్టర్‌ను బుధవారం తన చాంబర్‌లో ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో మిత్రులు రవి, ముత్యాలు, రఫీ, ఆదినారాయణ, మాజీ సర్పంచ్ మంజునాథ్ పాల్గొన్నారు.



పోస్టర్ విడుదల చేస్తున్న ఎస్పీ అన్బురాజన్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పెండ్యాల శ్రీలత, నాయకులు, కార్యకర్తలు

జనసేన, టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి: పెండ్యాల

అనంతపురం ప్రెస్‌క్లబ్: జనసేన, టీడీపీల తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని జనసేన పార్టీ రాయలసీమ మహిళా విభాగం కో-ఆర్డినేటర్ పెండ్యాల శ్రీలత అన్నారు. ఈ మేరకు బుధవారం ఆ పార్టీ మహిళా జిల్లా కార్యాలయంలో జనసేన, టీడీపీ ఉమ్మడి ప్రభుత్వంతోనే జరిగే అభివృద్ధిపై రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించిన ఆమె మాట్లాడారు. ప్రజలు జనసేన, టీడీపీలకు ఓటు వేసి నూతన ప్రభుత్వ స్థాపనకు కృషి చేయాలన్నారు. జగన్ రెడ్డిని ఓడించేందుకు ప్రతిఒక్కరూ సంసిద్ధులు కావాలన్నారు.



సీకేపల్లి ఎస్ఐగా వెంకటేశ్వర్లు

చెన్నేకొత్తపల్లి, ఫిబ్రవరి 21: చెన్నేకొత్తపల్లి మండల ఎస్ఐగా వెంకటేశ్వర్లు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన అనంతపురం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడి ఎస్ఐ శ్రీధర్ బదిలీపై ఎన్‌పీకుంటకు వెళ్లారు.

బెల్లం తయారీపై అవగాహన

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 21: నగర శివారు పాములాయి వద్ద ఉన్న శాంతరాజ్ బెల్లం పరిశ్రమను ఎస్ఎస్‌బీఎన్ కళాశాల బీకాం విద్యార్థులు బుధవారం సందర్శించారు. చెరకు పండించే విధానం, బెల్లం తయారీ, ఆరోగ్యాన్ని కాపాడడంలో బెల్లం ప్రాధాన్యత తదితర వాటిపై శాంతరాజ్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బెల్లం ఫ్యాక్టరీ ఎండీ థెరిస్సా, మురళీ, విద్యార్థులు పాల్గొన్నారు.



బెల్లం తయారీ విధానాన్ని వివరిస్తున్న శాంతరాజ్

ఆటోను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

-11మందికి గాయాలు

గుత్తి, ఫిబ్రవరి 21: పట్టణ శివారులోని అనంతపురం రోడ్డుపై బుధవారం డీజిల్ ఆటోను, ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటనలో 11మంది ప్రయాణికులు తీవ్రంగా గాయపడినట్లు పోలీసులు తెలిపారు. తాడిపత్రి మండలం గన్నెవారిపల్లి గ్రామానికి చెందిన చింతాజయమ్మ, సిరివెల్లి లక్ష్మీదేవి, ఉమాదేవి, నాగమునెమ్మ, లక్ష్మీనారాయణ, నాగచరణ్, హారిక పెద్దవడుగూరు మండలం ఆవులాంపల్లి గ్రామంలో బంధువుల వివాహానికి బయలుదేరారు. గుత్తిలో బస్సు దిగి ఆవులాంపల్లికి వెళ్లేందుకు ఆటో ఎక్కారు. వీరితో పాటు పెద్దవడుగూరు మండలానికి చెందిన చింతాలక్ష్మీదేవి, జయమ్మ, నాగరత్నమ్మ, రాముడు ఆటోలో ఎక్కారు. అనంతపురం రోడ్డులో ఓ పెట్రోల్ బంకు వద్దకు రాగానే అనంతపురం నుంచి కర్నూలుకు వెళ్లే మడకశిర డిపో ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ సంఘటనలో 11 మంది గాయపడ్డారు. వీరిలో నాగచరణ్, చింతాలక్ష్మీదేవి, రాములు, చింతాజయమ్మ తీవ్రంగా గాయపడ్డారు. వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం తరలించారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

టీడీపీతోనే అభివృద్ధి: పయ్యావుల కేశవ్



కాలువపల్లిలో మహిళతో మాట్లాడుతన్న కేశవ్

బెళుగుప్ప, ఫిబ్రవరి 21: టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. మండలంలోని కాలువపల్లిలో బుధవారం టీడీపీ మేనిఫెస్టో పథకాలు, బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన పయ్యావుల కేశవ్‌కు కార్యకర్తలు, అభిమానులు నీరాజనం పలికారు. మహిళలు హారతులిచ్చి తిలకందిద్ది స్వాగతించారు. ఇంటింటికి వెళ్లి ప్రచారం చేయగా సమస్యలు తెలిపారు. టీడీపీ అధికారంలోకి రాగానే అన్ని సమస్యలు పరిష్కరిస్తామని ధైర్యంగా వుండాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో జీవరత్నం, ఓబుళపతి, నీలకంఠారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, నాగరాజు, మల్లికార్జున, ఉలిగన్న, దిలీప్, ప్రవీణ్, మధు, బ్రహ్మయ్య, శ్రీనివాసులు, రామాంజి, అనిల్, రాజశేఖర్ మండల నాయకులు పాల్గొన్నారు.

లో ఓల్టేజీ సమస్యపై రైతుల ధర్నా



విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న రైతులు

బ్రహ్మసముద్రం, ఫిబ్రవరి 21: మండలంలోని నాగిరెడ్డిపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నంజాపురం ఫీడర్ రైతులు బుధవారం ధర్నా చేపట్టారు. గత రెండు నెలలుగా నంజాపురం ఫీడర్‌లైన్‌ను జింకలదొడ్డికి మెర్జ్ చేయడంతో లోఓల్టేజీ సమస్య నెలకొంది. దీంతో వ్యవసాయ పొలాల్లో విద్యుత్ ప్రమాదాలు జరుగుతున్నాయని రైతులు వాపోయారు. రెండు నెలలుగా అధికారులకు లోఓల్టేజి సమస్యపై విన్నవించినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. సంబంధిత అధికారులు వచ్చి సమస్యకు పరిష్కారం చూపే వరకు ఇక్కడి నుంచి వెళ్లే ప్రసక్తే లేదన్నారు. అనంతరం అధికారులు వచ్చి రైతులకు సర్ది చెప్పడంతో వెనుదిరిగారు.

ఉచిత కుట్టుశిక్షణా కేంద్రాలు ప్రారంభం



శిక్షణా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు చవ్వా గోపాల్‌రెడ్డి తదితరులు

యాడికి, ఫిబ్రవరి 21: ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాలతో మహిళలు తమ జీవన ప్రమాణాలు పెంపొందించుకోవాలని టీడీపీ నాయకుడు, క్లాస్-1 కాంట్రాక్టర్ చవ్వా గోపాల్‌రెడ్డి తెలిపారు. చవ్వా ఆదినారాయణరెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం గుడిపాడు, కొట్టాలపల్లి, కోనుప్పలపాడు గ్రామాల్లో మూడు ఉచిత కుట్టుశిక్షణ కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆర్థిక స్వావలంబన కోసమే ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మహిళలు వీటిని సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీటీసీ ఆదినారాయణ, గండికోట లక్ష్మణ్, రామకృష్ణ, బాలాంజనేయులు, సంజీవరాయుడు, క్రిష్టారెడ్డి, రామాంజనేయులు, యుగేంద్ర, సుధాకర్ పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

పామిడి, ఫిబ్రవరి 21: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి ఎదుట రోడ్డుకు అడ్డంగా ఉన్న పూలు, పండ్ల అంగళ్లను పంచాయతీ అధికారులు బుధవారం తొలగించారు. తెల్లవారుజామునే సీఐ రాజశేఖర్‌రెడ్డి తన సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేయగా ఈఓ చంద్రశేఖర్ తమ సిబ్బందితో వాటిని తొలగింపజేశారు. ఎన్నో ఏళ్లుగా ఆ అంగళ్లపై ఆధారపడి తమ కుటుంబాలను పోషించుకుంటున్నామని, ఇప్పుడు వాటిని తొలగిస్తే ఎలా బతకాలంటూ బాధితులు వాపోయారు. అలాగే ఆసుపత్రిలోకి వెళ్లేందుకు వాహనాలకు అడ్డం లేకుండా కంపచెట్లను తొలగించేశారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

యాడికి, ఫిబ్రవరి21: మండలంలోని కమలపాడు వద్ద ఏడుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.8800 స్వాధీనం చేసుకున్నామని సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడిచేసి ఏడుగురిని అరెస్ట్ చేసి కేసు నమోదుచేశామని సీఐ తెలిపారు.

కుందుర్పి: మండలంలోని బోధపల్లి గ్రామ సమీపాన బుధవారం పేకాట స్థావరంపై దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ వెంకటస్వామి తెలిపారు. ఈ దాడులలో ఇద్దరు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 1200లు, ఐదు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

వాటర్ షెడ్ పనులపై ప్రజావేదిక



ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

కళ్యాణదుర్గంరూరల్, ఫిబ్రవరి 21: వాటర్ షెడ్ గ్రామాలైన డి కొండాపురం, టీ వీరాపురం, గ్రామదట్ల, బోరంపల్లి గ్రామాలలో ఫిబ్రవరి 1, 2022 నుంచి 31 డిసెంబరు 2023 వరకు జరిగిన పనులపై వారం రోజులుగా సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ నేపథ్యంలో బుధవారం ప్రజావేదిక నిర్వహించి పనుల గురించి వివరించారు. సోలార్ లైట్లు, సిమెంట్ బెంచ్‌లు, ఉచిత పశువైద్యశాలలు, నీటి తొట్టెలు, వ్యవసాయ పరికరాలు, చెక్ డ్యామ్‌లు, చెక్ వాల్వ్‌లు, ఊటకుంటలు, అమృత్‌సరోవర్లు వంటి 1322 పనులకు గాను రూ. 4,43,06,609 ఖర్చుచేసినట్లు తెలిపారు. ఇందులో రూ. 95 వేలు రికవరీకి ఆదేశించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ జిల్లా నీటి యాజమాన్య సంస్థ వేణుగోపాల్ రెడ్డి, అదనపు పథక సంచాలకులు సుధాకర్ రెడ్డి, ఏపీడీ కృష్ణ చైతన్య, ఉపాధి హామీ ఏపీడీ రమేష్ నాయక్, ప్రాజెక్టు ఆఫీసర్ శ్రీ విద్య, ఎస్ఆర్పీ వెంకటేష్ నాయక్, డీఆర్పీలు రాజేష్, వినోద్ వాటర్ షెడ్ కమిటీ చైర్మన్లు, వాటర్ షెడ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గుంతకల్లులో డీఎస్పీకి వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు



కళ్యాణదుర్గంలో ఆర్డీవో సూపరింటెండెంట్ సందీప్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు



గుంతకల్లులో తహసీల్దారుకు వినతి పత్రాన్ని అందజేస్తున్న ఏపీయూడబ్ల్యూజే నాయకులు

జర్నలిస్టులకు రక్షణ కల్పించాలి

నినదించిన ఏపీయూడబ్ల్యూజే నాయకులు

ర్యాలీలు, అధికారులకు వినతిపత్రాలు అందజేత

సంఘీభావం తెలిపిన రాజకీయపార్టీలు

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 21: జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని ఏపీయూడబ్ల్యూజే నాయకులు బుధవారం డిమాండ్ చేశారు. జర్నలిస్టులపై దాడులను నిరసిస్తూ బుధవారం తహసీలార్దు శేషఫణి, ఆర్డీఓ కార్యాలయంలోని డీటీ శాంతకుమారికి ఏపీయూడబ్ల్యూజే నాయకులు వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో జరుగుతున్న అవినీతి, ఆరాచకాలు, దౌర్జన్యాలను ప్రశ్నించే మీడియా గొంతు నొక్కడం, జర్నలిస్టులపై దాడులు చేయడం హేయమైన చర్య అన్నారు. ఆంధ్రజ్యోతి ఫొటో గ్రాఫర్ శ్రీకృష్ణ, మద్దికెర ఆంధ్రజ్యోతి విలేకరి వీరశేఖర్, కర్నూలులో ఈనాడు కార్యాలయంపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జీఎం రఫి, హరగోపాల్, వెంకటరాముడు, శేషగిరి, కే రమేష్‌బాబు, జానకిరాముడు, సిద్దు, చంద్ర, ఏవీవీ ప్రసాద్, లక్ష్మీప్రసాద్ పాల్గొన్నారు.

కఠినంగా శిక్షించాలి: బీజేపీ

జర్నలిస్టులపై దాడులకు పాల్పడిన వైసీపీ అల్లరి మూకలను కఠినంగా శిక్షించాలని కోరుతూ డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డికి బుధవారం బీజేపీ నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ రాప్తాడు సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకలు దాడికి పాల్పడటం దుర్మార్గమన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు వడ్డెరమేష్, నాయకులు మహేష్, కిషోర్, నారాయణ, విజయలక్ష్మి, వెంకటరాఘవ, మునిరాజు, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

దాడి సిగ్గుమాలిన చర్య

కళ్యాణదుర్గం రూరల్: ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకల దాడి సిగ్గుమాలిన చర్య అని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ ముప్పూరి దేవరాజ్ అన్నారు. బుధవారం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం ఆర్డీవో కార్యాలయం వరకు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీగా వెళ్లారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీవో కార్యాలయం సూపరింటెండెంట్ సందీప్‌కు ఇచ్చారు. కార్యక్రమంలో పార్లమెంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదినారాయణ, స్టేట్ కౌన్సిల్ మెంబర్ వై నరసింహమూర్తి, సీనియర్ నాయకులు చెక్కా సుబ్రహ్మణ్యం, కో కన్వీనర్ గంగాధర, పట్టణ అధ్యక్షులు రామకృష్ణ రూరల్ అధ్యక్షులు కే సుధాకర్, బ్రహ్మసముద్రం, కంబదూరు, శెట్టూరు, మండల అధ్యక్షులు రాందాసు, గోపాల్, ఈవీ వెంకటరమణ, లీగల్ సెల్ కన్వీనర్ హనుమంతరాయుడు, యువ మోర్చా జిల్లా కార్యదర్శి కృష్ణ మోహన్ రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి బోయ సుమన్, అపిలేపల్లి కృష్ణ, ఓబీసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కఠిన చర్యలు తీసుకోవాలి: టీడీపీ

ఉరవకొండ: కర్నూలులో ఈనాడు కార్యాలయంపై దాడికి పాల్పడిన వైసీపీ నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈనాడు కార్యాలయంపై దాడికి నిరసనగా బుధవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కళ్లకు రిబ్బన్లు కట్టుకుని నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ రాప్తాడు సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై విచక్షణారహితంగా దాడి చేసిన వారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామాంజినేయులు, ప్యారం కేశవానంద, నర్రా కేశన్న, రహంతుల్లా, యర్రగుంట్ల వెంకటేశులు, సుంకన్న, ఈడిగవేణు, రామాంజనేయులు, గోపాల్, భరత్ పాల్గొన్నారు.

దాడి.. అమానుషం

పెద్దపప్పూరు: రాప్తాడు సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటో గ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ అల్లరి మూకలు దాడిచేయడం అమానుషమని జిల్లా తెలుగుయువత ఉపాధ్యక్షుడు తాతిరెడ్డి లోకనాథ్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉన్న జర్నలిస్టులపై దాడులు చేయడం మంచిదికాదన్నారు.

ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. దాడికి కారణమైన వైసీపీ గుండాలను అరెస్ట్‌చేసి కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావే శంలో మండల కన్వీనర్ గుర్తి రఘునాయుడు, మాజీ ఎంపీపీ కూచి సాయి మోహన్, మండల క్లస్టర్ విష్ణువర్దన్‌రెడ్డి, మైనార్టీ నాయకుడు షెక్షావలి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

మమ్మల్ని చంపేస్తారంట

మా స్థలాన్ని ఆక్రమించేందుకు వైసీపీ నాయకుల బెదిరింపులు

సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శి, ఆమె భర్త ఆవేదన



స్థలానికి సంబంధించిన పత్రాలను చూపుతున్న దంపతులు

యాడికి, ఫిబ్రవరి 21: అన్ని హక్కులు ఉన్న తమ స్థలాన్ని వైసీపీ నాయకులు కబ్జా చేయడానికి యత్నిస్తూ బెదిరిస్తున్నారని అనంతపురం రూరల్-2 సచివాలయం మహిళా సంరక్షణ కార్యదర్శి మల్లీశ్వరి, ఆమె భర్త కేవీ నారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. వారు తెలిపిన మేరకు అనంతపురం రూరల్-2 సచివాలయంలో మహిళా సంరక్షణ కార్యదర్శిగా పనిచేస్తున్న మల్లీశ్వరికి తన పుట్టినిల్లు అయిన యాడికిలోని గంగమ్మ ఆలయం వెనుక భాగంలో రెండు సెంట్ల స్థలం ఉంది. ఆ స్థలంలో చిన్నపాటి నిర్మాణం చేపట్టాలని మంగళవారం భర్తతో కలిసి ఆమె యాడికి వచ్చారు. తమ స్థలంలో నిర్మాణం పనులు చేపట్టారు. ఈ స్థలంపై కన్నేసిన వైసీపీ నాయకులు అక్కడికి వచ్చి దౌర్జన్యం చేశారని తెలిపారు. వైసీపీ మండల నాయకుడి అండతో ఒక ప్రజాప్రతినిధి సుమారు 20మంది అనుచరులను తీసుకువచ్చి తాము చేపట్టిన నిర్మాణాన్ని కూలదోశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని లేకుంటే చంపుతామని బెదిరించారని దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ మిమ్మల్ని ఉండనిచ్చేది లేదు. మీ స్థలం అమ్ముకొనిపోండి అంటూ బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పోలీసులను ఆశ్రయించనున్నట్లు బాధితులు తెలిపారు.

ఎమ్మెల్యే కేశవ్‌ను విమర్శించే అర్హత 'విశ్వ'కి లేదు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

బెళుగుప్ప, ఫిబ్రవరి 21: నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌ను విమర్శించే అర్హత వైసీపీ నాయకుడు విశ్వేశ్వరరెడ్డికి లేదని పలువురు టీడీపీ నాయకులు పేర్కొన్నారు. మండలంలోని కాలువపల్లిలో కన్వీనర్ ప్రసాద్ అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తూ పయ్యావుల ఆదరణ పొందుతుండగా.. మీరు కులాల మధ్య చిచ్చు పెడుతూ, రాజకీయాలు చేస్తూ మా ఎమ్మెల్యేపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఈ నాలుగున్నరేళ్లలో ఏమి అభివృద్ధి చేశారో చెప్పాలని, కనీసం ఓటు అడిగే అర్హత కూడా మీకు లేదన్నారు. నియోజకవర్గంలో వర్గకక్షలు లేకుండా ప్రశాంత వాతావరణం కల్పించేందుకు కేశవ్ ఎంతో కృషి చేశారన్నారు. సమావేశంలో పెద్దతిప్పయ్య, రాధాకృష్ణ, మల్లికార్జున, రాము, నరిగన్న, ప్రవీణ్ దామోదర్, శీర్పి, నాగభూషణం, బాల చిన్నప్ప, ప్రభాకర్ రెడ్డి, నాగరాజు, బ్రహ్మయ్య, మధు, అనిల్, దిలీప్, రాజశేఖర్, మల్లికార్జున, శ్రీనివాసులు, పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో జేసీపీఆర్ పర్యటన



యోగక్షేమాలను అడిగి తెలుసుకుంటున్న జేసీపీఆర్

తాడిపత్రి, ఫిబ్రవరి 21: పట్టణంలోని పలు ప్రాంతాల్లో మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పర్యటించారు. సీబీరోడ్డు, పుట్లూరు రోడ్డులో పర్యటించిన ఆయన ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న వ్యాపార సంస్థల్లోకి వెళ్లి వారి యోగక్షేమాలను ఆరాతీశారు. రోడ్లపై వెళుతున్న మహిళలు, యువకులతో మాట్లాడారు. రోడ్లపై ఉన్న చిరువ్యాపారుల వద్దకు వెళ్లి వ్యాపారం గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట నాయకులు, టీడీపీ కౌన్సిలర్లు ఉన్నారు.

ప్రజాసమస్యలు పట్టించుకోని ప్రభుత్వం



డ్రైనేజీని పరిశీలిస్తున్న జనసేన, టీడీపీ నాయకులు

ఉరవకొండ, ఫిబ్రవరి 21: ప్రభుత్వం ప్రజాసమస్యలను గాలికొదిలేసిందని జనసేన పార్టీ నాయకులు మండిపడ్డారు. పట్టణంలోని 9వ వార్డులో బుధవారం వారు పర్యటించారు. అంబేడ్కర్ నగర్‌లో రోడ్లు, డ్రైనేజీలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అర్ధంతరంగా ఆగిపోయిన సీసీ రోడ్లు, డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలన్నారు. అనంతరం కార్యదర్శి గౌస్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు గౌతమ్, టీడీపీ నాయకులు రామాంజనేయులు, జనసేన నాయకులు రాజేష్, రమేష్, మణికుమార్, మల్లేష్ గౌడ్ పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

రాయదుర్గం, ఫిబ్రవరి 21: పట్టణ సమీపంలోని పైతోట ఫారెస్ట్ వద్ద భారీగా కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు అర్బన్ సీఐ శ్రీనివాసులు బుధవారం తెలిపారు. అర్బన్ సీఐ శ్రీనివాసులు తన సిబ్బందితో పాటు రాయదుర్గం పట్టణం, పైతోట ఏరియా దగ్గర మొలకాల్మూరు వైపు నుండి ఫారెస్ట్ గుండా బుల్లుడ్ల తిప్పేస్వామి, ఆవుల రాజు అనే ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంలో కర్ణాటక మ ద్యాన్ని తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఎనిమిది బాక్సుల టెట్రా బాక్సులు, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సీఐ తెలిపారు.

వివాదాస్పద కట్టడాన్ని పరిశీలించిన సీఐ

యల్లనూరు, ఫిబ్రవరి 21: మండలంలోని 85నిట్టూరు గ్రామంలో ఆలయానికి ఆనుకొని ఉన్న స్థలంలో వివాదాస్పద కట్టడాన్ని పుట్లూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం బుధవారం పరిశీలించారు. శివాలయానికి ఆనుకొని ఉన్న స్థలాన్ని ఆక్రమించి కట్టడం చేపడుతుంటే అప్పట్లో గ్రామస్థులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు కట్టడాన్ని నిలిపివేయించారు. తాజాగా మళ్లీ నిర్మాణం చేపడుతుండటంతో గ్రామస్థులు సీఐకు ఫిర్యాదుచేశారు. దీంతో ఆయన గ్రామానికి వెళ్లి కట్టడాన్ని పరిశీలించారు. రెండురోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని గ్రామస్థులకు తెలిపారు.

తెలుగు రైతు సంఘం అధ్యక్షుడిపై దాడి దుర్మార్గం

పుట్లూరు, ఫిబ్రవరి 21: తెలుగురైతు సంఘం అధ్యక్షుడు మారెడ్డి శ్రీనివాసులరెడ్డిపై దుండగులు దాడిచేయడం దుర్మార్గమని అఖిల భారత రైతు ప్రధాన కార్యదర్శి జగదీశ్వరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో ఖండించారు. కక్షలు ఉంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలే తప్ప దాడులకు పాల్పడడం దారుణమన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

తాడిపత్రిటౌన్, ఫిబ్రవరి21: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల సమీపంలో నూతనంగా నిర్మించిన బుధవారమ్మతల్లి ఆలయంలో బుధవారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా శిఖర కలశ ప్రతిష్ఠ, మహా పూర్ణాహుతి, అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైభవంగా దేవమ్మదేవి జాతర



పుష్పలాంకరణలో దేవమ్మదేవి

బొమ్మనహాల్, ఫిబ్రవరి21: మండలంలోని కొడగనహళ్లి గ్రామంలో బుధవారం దేవమ్మదేవి ఊరి జాతర వైభవంగా ముగిసింది. మంగళ, బుధవారాల్లో జాతరను గ్రామస్థులు వైభవంగా నిర్వహించారు. బుధవారం వేకువ జామున కుంభాల మహోత్సవం నిర్వహించి అమ్మవారిని అభిషేకించారు. విశేష పుష్పాలంకరణ చేసి అమ్మవారికి దున్నపోతును బలి ఇచ్చారు. గ్రామంలో ప్రతి ఐదేళ్లకొకసారి ఈ ఊరి దేవర జాతరను నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు తనయుడు, తెలుగు యూత్ నాయకులు కాలవ భరత్ అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం మండల కన్వీనర్ బలరామి రెడ్డి, మాజీ జడ్పీటీసీ కుమ్మరి మల్లికార్జున, యర్రగుంట్ల వెంకటేశులు, నాగరాజు, పయ్యావుల మోహన్, పయ్యావుల అనిల్, నవీన్, కావలి ప్రభు, అనంతరాజు తదితరులు పాల్గొన్నారు.

హనుమంత వాహనంపై రంగనాథుడు



అలంకరణలో స్వామివారు

గుత్తిరూరల్, ఫిబ్రవరి 21: మండలంలోని తొండపాడులో వెలసిన బొలికొండ రంగనాథస్వామి బుధవారం శ్రీదేవి, భూదేవి సమేతంగా హనుమంతవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో వేకువ జామునే స్వామి వారిని సర్వాంగ సుందరంగా వివిధ రకాల పూలతో అలంకరిం చారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో కొలువుదీర్చి గ్రామవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ దేవదాసు ఆలయ అర్చకులు, చేతన్ వర్మ, రవి స్వామి, లిఖిల్ వర్మ, ఉదయ్, నవీన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి రథోత్సవం



ఆంజనేయస్వామి రథోత్సవాన్ని నిర్వహిస్తున్న భక్తులు

రాయదుర్గం, ఫిబ్రవరి 21: మండలంలోని చదం గ్రామంలో ఆంజనేయస్వామి రథోత్సవాన్ని గ్రామపెద్దల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే స్వామివారికి పంచామృతా భిషేకం, కుంకుమార్చన, వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ తదితర పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నర్సింగ్, టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

తాడిపత్రిటౌన్, ఫిబ్రవరి21: ఎకో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు ఉచితంగా నర్సింగ్, టైలరింగ్‌లలో శిక్షణ ఇస్తామని సంస్థ కార్యదర్శి ఉస్మాన్ బుధవారం తెలిపారు. ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వారి సహకారంతో పట్టణంలోని సంజీవనగర్ ఐదో రోడ్డులో ఉన్న పాత బీసీ హాస్టల్‌లో ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. పదో తరగతి, ఆపైన చదివిన వారు నర్సింగ్ శిక్షణకు అర్హులన్నారు. టైలరింగ్ శిక్షణకు కనీస అర్హత 7వ తరగతి అని తెలిపారు. 18నుంచి 35సంవత్సరాల లోపు మహిళలకు మాత్రమే శిక్షణ ఉంటుందన్నారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు ఒక బ్యాచ్, మధ్యాహ్నం 1గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు రెండో బ్యాచ్ ఉంటుంద న్నారు. వివరాలకు 8328132288, 9440107686 నెంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

గొప్పదనాన్ని వివరించిన అధ్యాపకులు

రాయదుర్గం, ఫిబ్రవరి 21: కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగుశాఖ ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ మాతృభాష అనేది జాతి ఉనికిని, సంస్కృతి, సంప్రదాయాన్ని తెలియజేస్తుందన్నారు. మన మాతృభాషను గౌరవించి, అభిమానించి, అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలియజేశారు. తెలుగు, ఆంగ్లము, హిందీభాషా అధ్యాపకులు సభను ఉద్దేశించి ప్రసంగిస్తూ మనము మన భావ ప్రకటన మాతృభాషలో చేసినట్లుగా పరభాషలో చేయలేమని ఈ విషయాన్ని గ్రహించి ప్రతి విద్యార్థి మాతృభాష స్పృహ ను కలిగి ఉండాలన్నారు. మాతృభాషలో నైపుణ్యాలను పెంచుకోవాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు తెలుగు పదాలను మాత్రమే ప్రయోగిస్తూ మాట్లాడే పోటీలో పాల్గొని మాతృభాష అభిమానాన్ని చాటి చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, తెలుగు అధ్యాపకులు డాక్టర్ లక్ష్మీనారాయణ, డీ నారాయణ, వై వనజమ్మ, కోదండరాం, దేవదాసు, వెంకటేశ్వర్లు, బాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు, డీ. నారాయణ, ఎం రామకృష్ణ, సీ దొడ్డ నాగప్ప తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తెలుగు అధ్యాపకులు

భార్యపై భర్త దాడి

పుట్లూరు, ఫిబ్రవరి21: మండలంలోని తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన బాల ఓబులేసు తన భార్య ఈశ్వరమ్మపై దాడి గాయపరిచినట్లు బుధవారం పోలీసులు తెలిపారు. రోజూ మద్యం తాగి వచ్చి కొట్టేవాడని బుధవారం తాగి కట్టెతో కొట్టగా ఈశ్వరమ్మకు గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారన్నారు. భార్య ఈశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన

యల్లనూరు, ఫిబ్రవరి 21: మండల కేంద్రంలో ఓటుహక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. స్థానిక కోటవీధి బీసీ కాలనీల్లో ఈవీఎం ద్వారా ఎలా ఓటు వేయాలి అనే విషయాలను యుఆర్‌డీ విజయశేఖర్‌నాయుడు తెలియజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ హరిప్రసాద్, వీఆర్వో వినోద్ పాల్గొన్నారు.